విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily

సంపుటి : 3 | సంచిక : 259 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 8 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్..

మోదీ మలేషియా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ

కౌలాలంపూర్ (మలేషియా) : మలేసియాలో త్వరలో కొత్త కాన్యులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం

- మిగతా2లో

భారత రైతులకు పూర్తి రక్షణ..

ట్రేడ్ డీల్ పై మంత్రి పీయూష్ గోయల

న్యూ దిల్లీ: అమెరికాతో ఇటీవల కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం పై కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూశ్ గోయల్ స్పందించారు. ఈ ట్రేడ్ డీల్‌లో భారత రైతులకు, ఎమ్ఎస్ఎమ్ఈ పరిశ్రమలకు పూర్తి రక్షణలు కల్పించామని చెప్పారు. అదే సమయంలో భారత వ్యవసాయ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసేందుకూ అవకాశం దక్కిందని అన్నారు. ఎర్రజొన్నలు, వైన్స్, స్పిరిట్స్ వంటి కొన్ని ఎంపిక చేసిన అమెరికా ఉత్పత్తులను మాత్రమే భారత్ లోకి అనుమతించినట్టు తెలిపారు.

- మిగతా2లో

విద్యార్థుల ఆవేదన విని చలించిపోయిన పవన్ కల్యాణ్

పవన్ సర్ రోజూ బురదలో నడుస్తూ స్కూలుకు వెళ్లలేకపోతున్నాం, దయచేసి మా ఊరికి రోడ్డు వేయండి అంటూ విద్యార్థులు చేసిన విన్నపం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కదిలించింది. సామాజిక మాధ్యమాల్లోని ఒక వీడియోలో విద్యార్థులు పడుతున్న వేదనను చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే స్పందించి గంటల వ్యవధి లోనే రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటు చేసుకుంది. గజ్జలవారిపల్లికి రూ.86 లక్షలతో తక్షణమే రోడ్డు మంజూరు చేసిన పవన్. కొండాపురం లోని గజ్జలవారిపల్లి గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ దారి బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో, వారు తమ కష్టాలను వివరిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఈ వీడియో గురించి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆవేదనను చూసిన ఆయన వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడారు.

- మిగతా2లో

రాజధానిలో మరో చరిత్రకు ముందడుగు

రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ కి శంకుస్థాపన

అమరావతి, ఫిబ్రవరి 07: ఏపీ రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా రూపు దిద్దుకునే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్రాత్మక ముందడుగు వేశారు. శనివారం తుళ్లూరు మండలం ఉద్ధండరాయుని పాలెం లో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి పునాది రాయి పడింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట్ రాష్ట్రానికి, దేశానికి మైలు రాయిగా నిలవనుంది. భారతదేశం లోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ కు అమరావతి వేదిక కానుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, ఉత్పత్తులు, నైపుణ్యాభివృద్ధికి ఇక్కడ విస్తృత అవకాశాలు ఉంటాయి. ప్రపంచం లోనే అత్యాధునిక క్వాంటమ్ హబ్ ల సరసన అమరావతిని నిలబెట్టాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, గ్లోబల్ టెక్ సంస్థల పెట్టుబడులు, స్టార్టప్ ఎకోసిస్టమ్ విస్తరణ, లక్షలాది మంది యువతకు అధునాతన నైపుణ్య శిక్షణ అందుబాటు లోకి వస్తాయి. ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తిచేసి, డిసెంబర్‌లోపు క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

క్వాంటమ్ టెక్నాలజీ ద్వారా సామాన్యుడి జీవితంలో గణనీయ మైన మార్పులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. దీంతో ఫార్మా

- మిగతా2లో

భారత వ్యాక్సీన్లు లేక పాక్ విలవిల.. 2031 నాటికల్లా..

అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న పాక్ కు భారత్ నుంచి అందుబాటు ధరల్లో టీకాలు నిలిచిపోవడంతో ఇక్కట్లు పెరిగాయి. 2031 నాటికల్లా స్థానికంగా టీకాల ఉత్పత్తిని పెంచకపోతే చిక్కుల్లో పడాల్సి వస్తుందని పాక్ ఆరోగ్య శాఖా మంత్రి ముస్తాఫా కమాల్ తాజాగా హెచ్చరించారు. పాక్ ప్రస్తుతం ఏటా సగటున 400 మిలియన్ డాలర్లు విలువైన టీకాలను గావీ అనే అంతర్జాతీయ కూటమి సహకారంతో

- మిగతా2లో

ఒబామా పై మరోసారి అక్కసు వెళ్లగక్కిన ట్రంప్

2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాల పై ఆరోపణలు.

సోషల్ మీడియాలో డీప్‌ఫేక్ వీడియో పోస్ట్.

అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్తాయిని మరిచి పోయి దిగజారిపో యారు. అత్యంత జుగుస్పాక ్రంగా అగ్రరాజ్యాధినేత వ్యవహరించారు. ఆయన తీరుతో మరోసారి తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు.

- మిగతా2లో

పదవికి గుడ్ బై చెప్పా, జనసేనకు కాదు బొలిశెట్టి క్లారిటీ

విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: జనసేన పార్టీకి బొలిశెట్టి సత్యనారాయణ రాజీనామా అంటూ జరుగుతున్న ప్రచారం పై ఆయన స్పందించారు. తాను కేవలం పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి మాత్రమే రాజీనామా చేశానని, జనసేన పార్టీ కీ కాదంటూ బొలిశెట్టి సత్యనారాయణ క్లారిటీ ఇచ్చారు. ఈ విషయాన్ని లేఖలోనూ ప్రస్తావించానని, అయితే కొంత మంది స్వార్థంతో దీనిని తప్పుగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. తాను ఎల్లప్పుడూ పవన్ కళ్యాణ్ వెంటే ఉంటానని స్పష్టం చేశారు. జనసేన

- మిగతా2లో

నంది అవార్డుల పై మంత్రి కందుల దుర్గేష్ కీలక ప్రకటన

రాజమండ్రి, ఫిబ్రవరి 07: ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నంది అవార్డుల పై కీలక ప్రకటన చేశారు. నంది నాటకోత్సవాలు, అవార్డుల పై కార్యాచరణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడామని తెలిపారు. రెండు, మూడు నెలల్లోనే నంది అవార్డులు ప్రదానం చేస్తామని స్పష్టం చేశారాయన. ఫిలిం టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని వ్యాఖ్యానించారు. శనివారం

- మిగతా2లో

వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం

- మధ్యంతర ఒడంబడికపై సంతకాలకు ఫ్రేమ్‌వర్క్ ఖరారు
- భారత్, అమెరికా సంయుక్త ప్రకటన
- మార్చిలో జరగనున్న సంతకాలు
- వెంటనే భారత్‌పై అదనపు సుంకాలను ఎత్తేసిన ట్రంప్
- మేక్ ఇన్ ఇండియా బలోపేతం: ప్రధాని

- మిగతా2లో

వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం

వాషింగ్టన్, న్యూయార్క్: మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి భారత్, అమెరికా శ్రీకారం చుట్టాయి. ఇందుకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేశాయి. ఈ విషయాన్ని శనివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో రెండు దేశాలు వెల్లడించాయి. తొలి దశలో కుదుర్చుకోనున్న ఈ ఒప్పందంపై మార్చిలో సంతకాలు జరగనున్నాయి. దీనివల్ల రెండు దేశాల మధ్య పలు ఉత్పత్తులపై సుంకాలు సున్నా స్థాయికిగానీ, గణనీయంగాగానీ తగ్గనున్నాయి. ఫ్రేమ్‌వర్క్‌పై సంయుక్త ప్రకటన వెలువడటానికి ముందు భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాలను ఎత్తివేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. ఈ నిర్ణయం మాత్రం శనివారం నుంచి అమల్లోకి వచ్చిందని శ్వేతసౌధం ప్రకటించింది. దీనికి ప్రతిగా రష్యా నుంచి ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ చమురును కొనుగోలు చేయబోమని భారత్ హామీ ఇచ్చిందని స్పష్టం చేసింది. మధ్యంతర ఒప్పంద ఫ్రేమ్‌వర్క్ ఖరారును ప్రధాని మోదీ స్వాగతించారు. దీనివల్ల మేక్ ఇన్ ఇండియా బలోపేతం అవుతుందని, యువత, మహిళలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

భారీ ప్రయోజనం

మధ్యంతర ఒప్పందం అమల్లోకి వస్తే భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులు, ఉత్పత్తులపై సుంకాలు సున్నా శాతం నుంచి 18 శాతం వరకూ అమలవుతాయి. ప్రస్తుతం అదనపు సుంకాలతో కలిసి 50శాతం ఉన్నాయి. శుక్రవారం 25శాతం అదనపు సుంకాలను ఎత్తి వేయడంతో 25 శాతానికి తగ్గాయి. అవి మరింత తగ్గనున్నాయి. కొన్నింటిపై సున్నా స్థాయికి చేరనున్నాయి. అమెరికా నుంచి భారత్‌కు వచ్చే ఉత్పత్తులపైనా సుంకాలు సున్నాగానీ, స్వల్పంగాగానీ ఉండనున్నాయి. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులు, ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులైన ఎండు ధాన్యాలు, పశువుల దాణాగా వాడే ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా, ప్రాసెస్డ్ పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్, ఆల్కహాల్‌పై సుంకాలు సున్నాగానీ, స్వల్పంగాగానీ ఉంటాయి.

భారత్, అమెరికా సంయుక్త ప్రకటన ప్రకారం.. రూ.45.29 లక్షల కోట్ల ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడి భాగాలు, విలువైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గు వంటి వాటిని దీర్ఘకాలంలో అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయనుంది.

ప్రధాని ప్రశంస

మధ్యంతర ఒప్పందం ఫ్రేమ్‌వర్క్ ఖరారు కావడంతో రైతులు, వ్యాపారులకు కొత్త అవకాశాలు లభిస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువతకు, మహిళలకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. భారత్‌తో బంధానికి కట్టుబడి ఉన్న ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. మధ్యంతర ఒప్పందం ఫ్రేమ్‌వర్క్ ఖరారుతో భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల వ్యాపారానికి ద్వారాలు తెరుచుకుంటాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలవారు, రైతులు, మత్స్యకారులు లబ్ధి పొందుతారని వివరించారు. గ్రామీణ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేలా.. పాలు, పాల ఉత్పత్తులు, చీజ్, మొక్కజొన్న, గోధుమ, బియ్యం, సోయా, కోళ్లు, ఇథనాల్ (ఇంధనం), పొగాకు, కొన్ని కూరగాయలు, మాంసం, గింజ ధాన్యాలు, జొన్నలు, సిరి ధాన్యాలు, రాగులు, తోటకూర, అరటి పండ్లు, స్ట్రాబెర్రీలు, చెర్రీలు, నిమ్మజాతి పండ్లపై సుంకాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఇంకా గ్రీన్ పీస్, కాబులీ శనగ, పెసర్లు, ఆయిల్ సీడ్స్, పశువుల దాణా, వేరుశనగ, తేనె, బార్లీ, వంటి ఉత్పత్తులు, ఆల్కహాల్ రహిత పానీయాలు, పిండి, గంజి, నిత్యావసర చమురులపైనా సుంకాలను భారత్ కొనసాగించనుంది.

ఒప్పందంలోని ముఖ్యాంశాలు..

తొలి దశలో భాగంగా భారత్ నుంచి ఎగుమతయ్యే రూ.3,98,536 కోట్ల ఉత్పత్తులపై సున్నా ప్రతీకార సుంకాలు అమలవుతాయి.

రూ.2,71,729 కోట్ల ఉత్పత్తులపై 18శాతం సుంకాలు అమలవుతాయి.

రూ.1,08,691 కోట్ల విలువైన ఉత్పత్తులపై ప్రస్తుత సుంకాలే అమలవుతాయి. వీటిలో ఉక్కు, రాగి, కొన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలున్నాయి. అన్ని దేశాలపైనా ఈ మూడింటిపై 50శాతం సుంకాలు అమలవుతున్నాయి. దీంతో వాటిలో మార్పులేదు.

సుంకాలు తగ్గే భారత ఉత్పత్తులు..

టెక్స్‌టైల్, అప్పారెల్, తోలు ఉత్పత్తులు, ప్లాస్టిక్‌లు, రబ్బర్, ఆర్గానిక్ కెమికల్స్, కళాకృతులు, పాదరక్షలు, ఆభరణాలు, యంత్ర విడి భాగాలు, బొమ్మలు, హోం డెకార్, స్మార్ట్ ఫోన్లు, వ్యవసాయ ఉత్పత్తులు.

రత్నాలు, వజ్రాలు, జనరిక్ ఔషధాలు, విమాన విడి భాగాలు, ఆటోమొబైల్ విడి భాగాలపై సున్నా సుంకాలు.

మసాలాలు, టీ, కాఫీ పొడర్లు, కోప్రా, కొబ్బరి నూనె, పోక చెక్కలు, జీడి పప్పు, బ్రెజిల్ నట్, చెస్ట్‌నట్, అవకాడో, అరటి, జామ, మామిడి, కివీ, బొప్పాయి, పైనాపిల్, పుట్టగొడుగులు, కూరగాయల సాగు పరికరాలు, టారో, బార్లీ, కానరీ విత్తనాలు, బేకరీ, కొకోవా, కొకోవా ఉత్పత్తులు, నువ్వులు, గసగసాలు, పండ్ల జామ్‌లు.. పేస్ట్‌లు.

అమెరికా ఉత్పత్తులు..

డేటా సెంటర్లకు, ఏఐకి ఉపయోగపడే పరికరాలు, అత్యున్నత నాణ్యత కలిగిన చిప్‌లు, ఐసీటీ గూడ్స్, యంత్రాలు.

వైన్స్, ఆల్కహాల్ ఉత్పత్తులు, వాల్‌నట్స్, బాదం, పిస్తా, బీన్స్.

హైఎండ్ కార్లు, మోటారు సైకిళ్లు, విమానాలు.

గుండె, న్యూరో, డయాబెటిస్ సంబంధిత ఔషధాలు, కాస్మెటిక్స్, వైద్య పరికరాలు, ఎక్స్‌రే వాల్వులు, డయాగ్నస్టిక్ పరీక్షల్లో వాడేవి, పేస్ మేకర్లు, హియరింగ్ ఎయిడ్లు, కృత్రిమ జాయింట్లు, ఇమేజింగ్ ఉపకరణాలు.

పదవికి గుడ్ బై చెప్పా, జనసేనకు కాదు బొలిశెట్టి క్లారిటీ

-మొదటిపేజీ తరువాయి

పార్టీకి రాజీనామా అంటూ జరుగుతున్న ప్రచారం పై బొలిశెట్టి సత్యనారాయణ స్పందించారు. తాను పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి మాత్రమే రాజీనామా చేశానని, పార్టీకి కాదంటూ బొలిశెట్టి సత్యనారాయణ క్లారిటీ ఇచ్చారు. జనసైనికుడిగా ఉద్యమం చేస్తున్నానని, తాను వేసిన కేసు విచారణ పూర్తయిన తర్వాత పవన్ కళ్యాణ్ ఏ బాధ్యతలు అప్పగించినా స్వీకరిస్తానని ప్రకటించారు. మరో వైపు జనసేనకు షాక్ కీలక నేత రాజీనామా అంటూ గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ క్రమం లోనే బొలిశెట్టి సత్యనారాయణ క్లారిటీ ఇచ్చారు. పర్యావరణానికి సంబంధించి వైసీపీ ప్రభుత్వ హయాంలో తాను కేసు వేశానని, ఆ కేసు ఇప్పటికీ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేనలో కీలక పదవిలో ఉండటం సముచితం కాదని పార్టీ పదవి నుంచి తప్పుకున్నట్లు బొలిశెట్టి వివరించారు. పర్యావరణం పై కేసు వేశాను. అది కోర్టు పరిధిలో ఉంది. నేను కేసు వేసినప్పుడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. వేరే వాళ్లు పర్యావరణ మంత్రిగా ఉన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చింది. కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ భాగస్వామిగా ఉంది. ఓ వైపు నేను జనసేన ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న సమయం లోనే మరో వైపు కూటమి ప్రభుత్వం మీద కేసు కొనసాగుతుంది. పార్టీలు మారినా ప్రభుత్వాలు కొనసాగుతాయి కావున ఆ కేసు అలాగే కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో నేను జనసేన పార్టీ పర్యావరణ ప్రధాన కార్యదర్శిగా ఉండటం సరికాదని, ఆ పదవికి రాజీనామా చేశా అన్నారు. జనసైనికుడిగా కొనసాగుతున్నా, పార్టీ కి రాజీనామా చేయలేదు, పదవికి మాత్రమే రాజీనామా చేశా అన్నారు. నేను రాసిన లెటర్ లో కూడా ఈ విషయం ఉంది. ఈ కేసు పూర్తయిన తర్వాత జనసేన పార్టీలో పవన్ కళ్యాణ్ ఏ బాధ్యతలు అప్పగించినా పనిచేస్తానని అందులో ఉంది. కానీ ఎవరిష్టం వచ్చినట్లు వారు ప్రచారం చేస్తున్నారు. అందుకే క్లారిటీ ఇస్తున్నా అని బొలిశెట్టి సత్యనారాయణ తెలిపారు.

మరోవైపు ఇదే విషయంపై బొలిశెట్టి సత్యనారాయణ ట్వీట్ కూడా చేశారు. జనసేనాని వెంటే జనసైన్యం ఉంటుందన్న బొలిశెట్టి.. రాజకీయ యవనికపై జనసేన కేవలం పార్టీ కాదని.. సామాజిక విప్లవంగా అభివర్ణించారు. జనసేన పార్టీ ఎన్నికల కోసం పుట్టింది కాదని.. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని.. మన సనాతన ధర్మం గొప్పతనాన్ని జతపరచి రూపొందించిన ఏడు మూల సిద్ధాంతాలపై ఆధారంగా నిర్మించిన వ్యవస్థగా పేర్కొన్నారు.ఏ పార్టీలో అయినా కార్యకర్తలకు పార్టీ నుంచి ఆర్థిక సాయం వస్తుందని.. జనసైనికులు మాత్రం తమ సొంత డబ్బుతో జనసేన జెండాను మోస్తున్నారని అన్నారు. జనసేనతో తన బంధం రాజకీయాలకు అతీతమైనదని.. ఒక సిద్ధాంతం కోసం తాను కేవలం పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి మాత్రమే రాజీనామా చేశానని బొలిశెట్టి ట్వీట్ చేశారు. అయితే దానిని కొందరు స్వార్థంతో తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్..

-మొదటిపేజీ తరువాయి

పలికారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్ లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగా సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11 వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, అస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. అభివృద్ధికి విశ్వసనీయ భాగస్వామిగా..ఇండియాను ఒక పెద్ద మార్కెట్ గానే గతంలో చూసేవారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయ మైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు.

మలేసియాను ప్రపంచం లోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్–మలేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందిరికీ తెలిసిందేనని అన్నారు. భారత్ కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. ఇండియా లోని పాపులర్ హిందీ గీతాలను అన్వర్ ఇబ్రహీం ఆలపిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయని, లెజెండ్రీ ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన బాగా ఇష్టపడతారని అన్నారు. దీనికి ముందు, భారత్‌కు చెందిన 800 మందికి పైగా నృత్యకారులు ప్రధానికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఎయిర్ పోర్ట్ నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం కలిసి ఒకే కారులో ప్రయాణించారు. భారత సంతతి ఆత్మీయ సమ్మేళనం వద్ద భారత్ మాతా కీ జై, 'మోదీ, మోదీ' అనే నినాదాలతో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

భారత రైతులకు పూర్తి రక్షణ..

-మొదటిపేజీ తరువాయి

పూర్తి స్థాయి ఒప్పందం పై మార్చ్ లో భారత్, అమెరికా సంతకాలు చేస్తాయని తెలిపారు. ఆ తరువాత 30 ట్రిలియన్ డాలర్ల అమెరికా మార్కెట్ లోకి భారత ఎగుమతిదారులకు అవకాశం లభిస్తుందని వివరించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పై సుంకాలు తక్కువని తెలిపారు. ఇరు దేశాల మధ్య కుదిరిన ఉమ్మడి కార్యాచరణ ప్రకారం, భారత్ పై ప్రతీకార సుంకం 18 శాతానికి తగ్గిందని చెప్పారు. అదనంగా విధించిన 25 శాతం సుంకాన్ని కూడా అమెరికా ఉపసంహరించుకుందని చెప్పారు. మన ఉత్పత్తుల పై సుంకం 18 శాతం సుంకం అని, ఇది పొరుగు దేశాలతో పోలిస్తే మెరుగు అని తాజాగా నిర్వహించిన పత్రికా సమావేశంలో కేంద్ర మంత్రి తెలిపారు. చైనా వస్తువుల పై 35 శాతం, వియత్నాం, బంగ్లాదేశ్ వస్తువుల పై 20 శాతం, ఇండోనేషియా వస్తువుల పై 19 శాతం చొప్పున అమెరికా సుంకాలు విధిస్తోందని అన్నారు. భారత ఎగుమతిదారులు అనేక వస్తువులను ఎలాంటి సుంకాల బెడద లేకుండా అమెరికాకు ఎగుమతి చేయొచ్చని చెప్పారు. పలు వ్యవసాయ ఉత్పత్తుల పై కూడా ఎలాంటి సుంకాలు ఉండని చెప్పారు. మసాలాదినుసులు, టీ, కాఫీ, కొబ్బరి నూనె, జీడిపప్పు, పలు రకాల పండ్లు, కూరగాయాలను సుంకాల బెడద లేకుండా అమెరికాకు ఎగుమతి చేసుకోవచ్చని మంత్రి వివరించారు. భారత వ్యవసాయ రంగానికి రక్షణ కల్పించామని కూడా మంత్రి వివరించారు. విదేశీ ఉత్పత్తులకు భారత వ్యవసాయ రంగం తలుపులను పూర్తిగా తెరవలేదని భరోసా ఇచ్చారు. భారత దేశం స్వయం సమృద్ధి సాధించిన వ్యవసాయ ఉత్పత్తులను ట్రేడ్ డీల్ పరిధి లోకి తేలేదని వివరించారు. మాంసం, పౌల్ట్రీ, డెయిరీ, సోయాబీన్, మొక్కజొన్న, వరి, గోధుమలు, చక్కెర, జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలు వంటివి అమెరికా నుంచి తక్కువ టారిఫ్ లకు భారత్ లోకి అనుమతించబోమని చెప్పారు. గ్రీన్ టీ, కాబూలీ శనగలు, పల్లీలు, మాల్ట్, మాల్ట్ ఆధారిత ఉత్పత్తులకు కూడా ఈ ట్రేడ్ డీల్‌లో ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదని వివరించారు. భారత రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే కొందరు ఈ ట్రేడ్ డీల్‌ను చూసి ఆశ్చర్యపోతున్నారు అని వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ కామెంట్ చేశారు.

విద్యార్థుల ఆవేదన విని చలించిపోయిన పవన్ కల్యాణ్

-మొదటిపేజీ తరువాయి

రోడ్డు నిర్మాణానికి అవసర మైన అంచనాలను వెంటనే రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అధికారులు వెంటనే స్పందించి 1.6 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 86 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గజ్జలవారిపల్లి విద్యార్థులకే కాకుండా, పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఏళ్లనాటి కష్టాలు తీరనున్నాయి.

నంది అవార్డుల పై మంత్రి కందుల దుర్గేష్ కీలక ప్రకటన

-మొదటిపేజీ తరువాయి

రాజమండ్రిలో మంత్రి కందుల దుర్గేశ్ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొత్త టూరిజం పాలసీ ద్వారా ఏపీలో 4,373 హోటల్స్‌లో రూమ్ లు ఏర్పాటు చేశామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రూ.428 కోట్ల పెట్టు బడులు తీసుకొచ్చామని వివరించారు. ఈ ఏడాది నుంచి సీ ప్లేన్ టూరిజాన్ని అందుబాటు లోకి తీసుకువస్తామని చెప్పారు. 7 యాంకర్ హబ్‌లు ఏర్పాటు చేశామన్న ఆయన.. రూ.115 కోట్లతో హరిత హోటల్స్‌ను ఆధునికీకరించామని వెల్లడించారు. పురాతన మండువా ఇళ్లను.. హోంస్టేలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

రాజధానిలో మరో చరిత్రకు ముందడుగు

-మొదటిపేజీ తరువాయి

రంగంలో పరిశోధనలు వేగవంతం కానున్నాయి. వ్యవసాయంలో వాతావరణ అంచనాలు, నీటి వినియోగం, దిగుబడి అంచనాలు కచ్చితంగా ఉండటం, బ్యాంకింగ్ డిజిటల్ లావాదేవీల భద్రత పెరగడం వంటి అనేక ప్రయోజనాలు లభించనున్నాయి. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచం లోని బోస్టన్, సింగపూర్, షాంఘై వంటి క్వాంటమ్ కేంద్రాలతో సమానంగా నిలవనుంది. భవిష్యత్తులో అమరావతి.. క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకి ప్రపంచ కేంద్రంగా మారనుందని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్ ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. క్వాంటమ్ వ్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహా ఏపీ మంత్రులు నారా లోకేష్, నారాయణ, కందుల దుర్గేష్, తాడికొండ ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత వ్యాక్సీన్లు లేక పాక్ విలవిల..

-మొదటిపేజీ తరువాయి

దిగుమతి చేసుకుంటోంది. ఈ ఖర్చులో 49 శాతం అంతర్జాతీయ సంస్థలు భరిస్తుండగా మిగిలిన డబ్బును పాక్ ప్రభుత్వం చెల్లిస్తోంది. పేదదేశాల్లో పిల్లలకు టీకాలు అందుబాటులో ఉండేందుకు గ్లోబల్ అలయెన్స్ ఫర్ వ్యాక్సిన్ అండ్ ఇమ్యునైజేషన్ (గావీ) కృషి చేస్తోంది. వివిధ దేశాల నుంచి తక్కువ ధరకు టీకాలను సేకరించి పేద దేశాలకు సరఫరా చేస్తుంటుంది. గావీకి పంపించే టీకాల్లో అధిక శాతం భారతీయ సంస్థల్లో తయారవుతుంటాయి. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు ఎన్ని ఉన్నప్పటికీ గావీ ద్వారా టీకాల సరఫరా చాలా కాలం పాటు కొనసాగింది. అయితే, గతేడాది ఇరు దేశాల ఉద్రిక్తతల పతాకస్థాయికి చేరుకున్నాక భారత్ నుంచి టీకాల సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం పాక్ ప్రభుత్వం తమ దేశ ప్రజలకు 13 రకాల టీకాలను ఉచితంగా అందిస్తోంది. ఇవన్నీ విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2031 కల్లా టీకా దిగుమతుల ఖర్చు 1.2 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని పాక్ మంత్రి హెచ్చరించారు. స్థానికంగా ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

ఒబామా పై మరోసారి అక్కసు వెళ్లగక్కిన ట్రంప్

-మొదటిపేజీ తరువాయి

మాజీ అధ్యక్షుడు ఒబామా దంపతులను కించపరుస్తూ వారి ముఖాలకు కోతుల బాడీలను అతికించి వీడియో తన సోషల్ మీడియాలో ట్రంప్ పెట్టారు. దీని పై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలను ట్రంప్ అనుచరులు, రిపబ్లికన్లు ఖండించాలని కోరుతున్నారు. అయితే, గతం లోనూ ట్రంప్ ఇలాగే వ్యవహరించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఆయన సతీమణి మిషెల్లీ ఒబామాలను కోతులుగా చిత్రీకరిస్తూ రిపబ్లిక్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోస్ట్ చేసిన వీడియో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క నిమిషం నిడివి ఉన్న ఈ వీడియోను ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యం ట్రూత్ సోషల్ పోస్ట్ చేస్తూ మరోసారి 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాల పై ఆరోపణలు చేశారు. బ్యాలెట్ లెక్కింపు కంపెనీ డొమినియన్ ఓటింగ్ సిస్టమ్స్ 2020 ఎన్నికల్లో తన విజయాన్ని లాక్కోడానికి సహాయపడిందని ఆరోపించారు. వీడియో చివరలో ఒబామా దంపతులను కోతులుగా చిత్రీకరించారు. కోతుల శరీరాలకు మాజీ అధ్యక్ష దంపతుల ముఖాలను అతికించారు. బరాక్ ఒబామా, ఆయన భార్య మిషెల్లీ ఒబామా కనిపించే వీడియోకు బ్యాక్ గ్రౌండ్‌లో ది లైన్ స్లీప్స్ టు నైట్ అనే పాటను పెట్టారు. ఈ వీడియో పై కాలిఫోర్నియా గవర్నర్, ట్రంప్ పై తరుచూ విమర్శలు గుప్పించే గవిన్ న్యూసన్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. రిపబ్లిక్ నేత ప్రవర్తన అత్యంత అసహ్యకరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2028 అమెరికా ఎన్నికల్లో డెమొక్రాట్ల ప్రెసిడెంట్ అభ్యర్థిత్వం కోసం పోటీలో ఉన్నవారిలో గవిన్ ఒకరు. అధ్యక్షుడి ప్రవర్తన అత్యంత అసహ్యకర మైంది, ప్రతి రిపబ్లికన్ దీనిని ఖండించాలి అని ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. అమెరికా జాతీయ మాజీ భద్రతా సలహాదారు, ఒబామా సన్నిహితుడైన బెన్ రోడెస్ స్పందిస్తూ ట్రంప్ చరిత్రకు మాయని మచ్చలాంటివారని, అతడి అనుచరులు కూడా జాత్యహంకార అని కూడా ముద్ర వేశారని అన్నారు. భవిష్యత్ అమెరికన్లు ఒబామాను ప్రియ మైన వ్యక్తులుగా ఆలింగనం చేసుకుంటారని, అదే సమయంలో ఆయనను మన చరిత్ర పై ఒక మచ్చగా చూస్తారు. ట్రంప్, అతడి జాత్యహంకార అనుచరులను వెంటాడుతారు అని అన్నారు. అయితే, ట్రంప్ గతం లోనూ ప్రపంచ నాయకులను ఏఐ వీడియోల సాయంతో ఎగతాళి చేసిన సందర్భాలు ఉన్నాయి. గతేడాది కూడా ఒబామాను ఒవెల్ ఆఫీసులో అరెస్ట్ చేస్తున్నట్టు ఓ వీడియో రూపొందించారు. మరో నల్లజాతి నాయకుడు హకీమ్ జెఫ్రీస్ వ్యగ్యంగా చిత్రీకరించారు. అమెరికా చరిత్రలో ఏకైక నల్లజాతి అధ్యక్షుడిగా ఒబామా రికార్డులకు ఎక్కారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో కమలా హ్యారిస్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.

లడ్డూ కల్తీ కి క్షమాపణ చెప్పే వరకు వైకాపా నేతలకు దర్శన నిషేధం విధించాలి.

- సిట్, ల్యాబ్ రిపోర్టులు స్పష్టం చేసినా తప్పు ఒప్పుకోని జగన్ అండ్ కో.
- సనాతన ధర్మ పరిరక్షణకు పవన్ కళ్యాణ్ కట్టుబాటు జనసేన స్పష్టం.
- ఆమదాలవలస జనసేన పార్టీ ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్.

ఆమదాలవలస, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: పవిత్ర పుణ్యక్షేత్రం, కలియుగ వైకుంఠం తిరుమలలో వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీకి పాల్పడిన మహాపాపులు వైకాపా నేతలు అని, వాళ్ళు తమ తప్పు ఒప్పుకుని క్షమాపణ చెప్పే వరకు స్వామి వారి దర్శన నిషేదాన్ని విధించాలని జనసేన పార్టీ ఆముదాలవలస నియోజకవర్గ ఇన్ఛార్జి పేడాడ రామ్మోహన్ కోరారు. బహిరంగ క్షమాపణ కోరకుండా వారు దర్శనాలకు వస్తే తాను ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని హెచ్చరించారు. లడ్డూ కల్తీ విషయంలో వైకాపా నేతల తీరుకు నిరసనగా పేడాడ రామ్మోహన్ ఆధ్వర్యంలో శనివారం ఆమదాలవలసలో ప్రాయశ్చిత దీక్షను నిర్వహించారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే, పియూసి చైర్మన్ కూన రవికుమార్, రామ్మోహన్ దీక్షకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ, హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా గత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిందన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని సిట్, ల్యాబ్ రిపోర్టులు స్పష్టంగా చెబుతున్నప్పటికీ, జగన్ అండ్ కో తప్పును ఒప్పుకోక ఎదురుదాడికి దిగుతుందన్నారు. దేవుడి సొమ్మును దోచుకునేందుకు నిబంధనలు మార్చి ఇష్టారాజ్యంగా నిబందనలు సడలించి నెయ్యి సరఫరాకు ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. నివేదికల ఆధారంగా చూస్తే అసలు పాలే వాడకుండా నెయ్యి ఎలా వస్తుందని ప్రశ్నించారు. వారు చేసిన తప్పులు, పాపాలను ప్రజలు క్షమించినా ఆ కలియుగదైవం క్షమించడని, తగిన శిక్ష అనుభవిస్తారని హెచ్చరించారు. ఇప్పటికైనా వారు తమ తప్పును ఒప్పుకుని అలిపిరి వద్ద చెంపదెబ్బలు వేసుకుని బహిరంగ క్షమాపణ కోరాలని హితవు పలికారు. పేడాడ రామ్మోహన్ మాట్లాడుతూ, హిందువులంటే కిట్టని నాటి ముఖ్యమంత్రి జగన్ హిందువుల మనోభావాలను దెబ్బతీయాలన్న లక్ష్యంతోనే తిరుమల ప్రసాదంలో కల్తీకి పాల్పడ్డారని మండి పడ్డారు. విదేశాల నుంచి వచ్చే కాసులకు కక్కుర్తి పడి మహాపచారానికి పాల్పడ్డారని, 2022 లోనే ఈ విషయంలో వెలుగు లోకి వచ్చినా కనీసం చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు. సిట్ వంటి అత్యున్నత సంస్థ ఇచ్చిన నివేదికను సైతం పట్టించు కోకుండా, తాము తప్పు చేయలేదని వితండవాదన చేయడం సిగ్గుచేటన్నారు. లడ్డూ కల్తీకి పాల్పడిన వారందరికీ వేంకటేశ్వర స్వామి దర్శనాలకు అవకాశం లేకుండా బహిష్కరణ విధించేందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవాలని కోరారు. సనాతన ధర్మ పరి రక్షణకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కట్టుబడి ఉన్నారని, ఆయన బాటలోనే జనసైనికులు కృషి చేస్తారని స్పష్టం చేసారు. లడ్డూవిషయంలో జరిగిన మహాపాపాన్ని హిందువులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తిరుమల వేంకటేశ్వరస్వామికి, భక్తులకు బహిరంగ క్షమాపణ చెప్తే గాని వైకాపా నేతలకు తిరుమలకు రాకూడని, క్షమాపణ కోరకుండా వారు తిరుమల వస్తే తాను ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నానని రామ్మోహన్ స్పష్టం చేసారు. ఈ ప్రాయశ్చిత్త దీక్షకు టిడిపి జిల్లా అధ్యక్షుడు మొదలసవలస రమేష్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, బిజెపి నియోజకవర్గ ఇన్ఛార్జి పేడాడ సూరప నాయుడు, జనసేన ఎంపిటిసి అంపిలి విక్రమ్, కూటమి నాయకులు తమ్మినేని గీత, అంబల్ల రాంబాబు, కీర్తి సుశీల, పైడి మురళీమోహన్, పైడి నరేష్, బగాదీ రాజేశ్వరరావు, కాగితపల్లి రాంబాబు, సిర్లపు గణేష్, పొన్నాడ బాలకృష్ణ, పొట్నూరు ప్రసాద్, తోట అప్పలరాజు, పంచిరెడ్డి శ్రీనివాసరావు, వీర గొట్టపు బాల మురళి, కొంచాడ చిన్నం నాయుడు, సిడగం త్రిలోచన, తులగాపు ధనుంజయ, బెజ్జిపురపు శ్రీపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీ హిల్స్ కు బస్సులను ప్రారంభించిన మంత్రి

విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: మద్దిలపాలెం డిపోలో ఐటీ ఎంప్లాయిస్ రవాణా సౌకర్యార్థం విశాఖపట్నం లోని పలు ప్రాంతాలనుండి మధురవాడ ఐటీ హిల్స్ కు ఇప్పటివరకు నడుపుతున్న 8 బస్సులకు అదనంగా 2 ప్రత్యేక బస్సులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొలి దశలో 4 బస్సులను తేది. 21.10.2024 నుండి నడపడ మైనదని, రెండవ దశలో మరో నాలుగు బస్సులను తేదీ 17.05.2025 నుండి నడుపుతున్నామని, దీని వలన సంవత్సరానికి సుమారు రూ.1,29,85,056 వరకు ఐ.టి. ఎంప్లాయిస్ లబ్ది పొందుతున్నారని తెలిపినారు. అలాగే, ఐ.టి. హిల్స్ ఎంప్లాయిస్ సంఖ్య పెరుగుతూ ఉండడం వలన, ఈ 8 బస్సులకు అదనముగా మరో 2 బస్సులను నడుపుటకు ఏర్పాటు చేయడ మైనది. ఈ 2 బస్సులలో ఒక బస్సును కొత్తవలస నుండి, రెండవ బస్సును విజయనగరం నుండి మధురవాడ ఐ.టి. హిల్స్ కు నడపడం జరుగుతున్నదన్నారు. తదుపరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, విశాఖపట్నం ను ఐ.టి. హబ్ గా రూపొందించే కృషిలో దేశం లోనే నెంబర్ వన్ పొజిషన్ లో నిలుపుటకు తీసుకుంటున్న నిర్ణయాలలో భాగంగా, విశాఖపట్నం, విజయనగరం లో గల వివిధ ప్రాంతాలనుండి మధురవాడ ఐ.టి. హిల్స్ కు ప్రత్యేక బస్సులను నడుపుచున్నామని తెలియజేసినారు. అదేవిధంగా ప్రజలకు మరింత రవాణా సౌకర్యం కల్పించేందుకుగాను, రాష్ట్ర వ్యాప్తంగా 700 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేయనున్నట్లు, దానిలో భాగంగా 100 ఎలక్ట్రికల్ బస్సులను విశాఖపట్నం జిల్లా కి కేటాయించుట జరిగినదని తెలియజేసినారు. స్త్రీ శక్తి (మహిళల ఉచిత ప్రయాణ సౌకర్యం) పథకంలో భాగంగా, అత్యధిక మహిళలకు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంలో విశాఖపట్నం జిల్లా, రాష్ట్రం లోనే మొదటి స్థానంలో ఉందని తెలియజేసినారు. అదేవిధంగా ఏ.పి.యస్.ఆర్.టి.సి, విశాఖపట్నం జిల్లాలో సంక్రాంతి పండుగ స్పెషల్ ఆపరేషన్ లో భాగంగా సుమారు 1,105 బస్సులను నడిపి, అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన అన్ని డిపోలలో కండక్టర్ల, డ్రైవర్లకు, బస్సులను ఎప్పటికప్పుడు నిర్వహణ చేస్తూ మంచి కండిషన్ గల బస్సులను అందించిన మెకానిక్ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసి వారికి అభినందనలు తెలియజేసారు. అదేవిధంగా, ప్రభుత్వ ఆదేశాలతో ఏ.పి.యస్.ఆర్.టి.సి, విశాఖపట్నం జిల్లాలో అర్హులైన వివిధ కేటగిరీలలో (కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ లు) పదోన్నతి పొందిన ఉద్యోగులకు పదోన్నతా పత్రాలను అందజేసినారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్, యమ్.ఎల్.ఏ.లు వెలగపూడి రామకృష్ణ బాబు, పి. విష్ణు కుమార్ రాజు, ఆర్.టి.సి. జోనల్ చైర్మెన్ దొన్ను దొర, ఏ.పి.ఈ.డి.బి. మేనేజర్ (ఐ.టి) పి. కీర్తన ఆనంద్, ఏ.పి.యస్.ఆర్.టి.సి. విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. విజయగీత, విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పల నాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి. సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఏ.గంగాధర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) కె. వి. అరుణ్ కుమార్, పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, అకౌంట్స్ ఆఫీసర్ కుమారి, వి. వంశీ మోహిని, డిపో మేనేజర్లు, సూపర్వైజర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలన పై పెరుగుతున్న ప్రజాదరణ.

- ఎమ్మెల్యే బండారు సమక్షంలో తెలుగుదేశం లోకి చేరికలు.
- ఆలమూరు వైసిపి అధ్యక్షుడుతో సహా పలువురు తెలుగుదేశంలో చేరిక.

ఆలమూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో కొనసాగిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమిపాలన పై ప్రజల్లో ఆదరాభిమానాలు పెరుగుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. ఆలమూరులో శనివారం ఆలమూరు గ్రామ వైసీపీ పార్టీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు తో సహా పలువురు ఎమ్మెల్యే బండారు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే బండారు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి అందరూ కలిసి పాటుపడాలన్నారు.

ముఖ్యమంత్రి కృషి తోనే మెడికల్ కళాశాల, పీజీ సీట్లు

- మెడికల్ కళాశాల సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి.
- మంత్రి సత్య కుమార్ తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.
- సిబ్బంది కొరతతో పాటు పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే.
- రానున్న రోజుల్లో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానన్న ఎమ్మెల్యే.

అనంతపురం, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి తోనే 25 ఏళ్ల క్రితం అనంతపురంలో మెడికల్ కళాశాల ఏర్పాటైందని, ఆ తర్వాత ఆయన హయాం లోనే పీజీ సీట్లు కూడా వచ్చాయని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శనివారం జరిగిన మెడికల్ కళాశాల సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ఆయన మంత్రి సత్యకుమార్ తో కలిసి పాల్గొన్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్యేకి కళాశాల అధ్యాపకులు, వైద్యులు ఘన స్వాగతం పలికారు. సిల్వర్ జూబ్లీ పైలాన్ కు మంత్రి సత్యకుమార్, ఎమ్మెలీ దగ్గుపాటి ప్రసాద్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వెనుకబడిన అనంతపురం జిల్లాకు మెడికల్ కళాశాల తీసుకొచ్చింది, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే అన్నారు. ఈ క్యాంపస్ సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా ఉండటం వలన ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు. ఆ తర్వాత 2014 లో పీజీ సీట్లు కూడా వచ్చాయన్నారు. 25 ఏళ్ల పాటు దినదినాభివృద్ధి చెందుతూ అనేక అవార్డులు సాధించే విధంగా కళాశాల మారిందంటే, ఇక్కడ పని చేసే ఎంతో మంది అధ్యాపకుల కృషి ఉందన్నారు. జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కూడా టీడీపీ హయాం లోనే వచ్చిందన్నారు. ఇది పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించడం నిజంగా ఒక వరం అన్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వాసుపత్రిలో రోగుల సంఖ్య భారీగా పెరిగిందని, 3 వేల మంది అవుట్ పేషేంట్లు, 13 వందల మంది ఇన్ పేషెంట్లు ఉన్నారన్నారు. అందుకే దీనిని 13 వందల పడకల ఆసుపత్రిగా మార్చాలని కోరామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ జిల్లా పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మెడికల్ కళాశాలలో అధ్యాపకులు ఇతర స్టాఫ్ 441 మంది ఉండాల్సి ఉండగా, 308 మంది మాత్రమే ఉన్నారని, ఇంకా 133 మంది సిబ్బంది కొరత ఉందన్నారు. వీటిని భర్తీ చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే నిర్మాణం పూర్తి చేసుకున్న మహిళా హాస్టల్ ను ప్రారంభించడంతో పాటు నూతన ల్యాబ్ ను ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్ ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు.

కొండవీడు ఉత్సవాలలో నాయకులు

పల్నాడు, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: జిల్లాలో జరుగుతున్న కొండవీడు ఉత్సవాల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు కృష్ణదేవరాయలు తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం పాల్గొన్నారు. కొండవీడు ప్రాంత చారిత్రక, పర్యాటక ప్రాధాన్యాన్ని వెలుగు లోకి తీసుకువచ్చి, సమగ్ర అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటామని కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ కొండవీడు ప్రాంతం శౌర్యానికి, సంస్కృతికి ప్రతీకగా నిలిచిన చారిత్రక ప్రదేశమని పేర్కొన్నారు. ఎత్తయిన కొండలు, పచ్చదనం, ఘాట్ రోడ్లు ప్రకృతి ప్రేమికులకు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయని చెప్పారు. రెడ్డి రాజుల కాలంలో ఈ ప్రాంతం హిందూ సామ్రాజ్య రక్షణలో కీలక పాత్ర పోషించిందని వివరించారు. తెలుగు సాహిత్యం, శిల్పకళ, చిత్రకళలకు కొండవీడు కేంద్రంగా నిలిచిందని తెలిపారు. ట్రెక్కింగ్‌కు వచ్చే యువత చరిత్రతో అనుసంధానం కలిగే విధంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎత్తైన ప్రదేశంలో రక్షణ ఏర్పాట్లు, చెరువుల ద్వారా జల సంరక్షణ వంటి అంశాలు అప్పటి ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనమని చెప్పారు.

ప్రకృతిని కాపాడుతూ సంస్కృతిని నిలబెట్టిన ప్రాంతంగా కొండవీడు ప్రత్యేకతను గుర్తించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 201419 మధ్య రూ.40 కోట్లతో రోడ్లు, మౌలిక వసతులు అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంస్కృతిని కాపాడే దిశగా పనిచేస్తోందని తెలిపారు.

కొండవీడు కోట ఉన్నంతకాలం తెలుగుతనం అజేయంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. పర్యాటక అభివృద్ధి కారణంగా భూముల విలువ గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసర మైన డీపీఆర్‌లు సిద్ధం చేసి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆనం నారాయణ రెడ్డి, పల్నాడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పత్తిపాటి పుల్లారావు, కలెక్టర్ ప్రతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సంజనా సింహా, నన్నపనేని రాజకుమారి, గోనుగుంట్ల కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరుగా 'చెత్త' జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత.

- స్వచ్ఛాంధ్రే కూటమి ప్రభుత్వ లక్ష్యం, ఇళ్ల ముంగిటకే స్వచ్ఛ రథాలు.
- పాడి చెత్తకు విలువ కట్టి 20 రకాల నిత్యావసర వస్తువులు ఇస్తున్నాం.
- తడి చెత్తతో సేంద్రీయ ఎరువుల తయారీ.
- చెత్త కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం.
- చెత్త పై పన్ను వేసిన ఘనుడు జగన్.
- చెత్తతో సంపద సృష్టించిన ఘనత సీఎం చంద్రబాబుదే మంత్రి సవిత.

చెన్నూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: చెత్త పై జగన్ పన్ను వేసి వేధిస్తే, తమ ప్రభుత్వం చెత్త ద్వారా సంపద సృష్టించి ప్రజలకు ఆదాయం మార్గం చూపించామని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చెన్నూరు మండల కేంద్రంలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డితో కలిసి మంత్రి సవిత శనివారం ప్రారంభించారు. అనంతరం చెన్నూరు లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర లక్ష్యంతో ఏపీని పరిశుభ్రంగా ఉంచాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. దేశం లోనే ఏపీని అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది ఆయన సంకల్పమన్నారు. 2014-19 లోనే ఏపీలో ప్రతి గ్రామం లోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు. తరవాత వచ్చిన జగన్ ఆ కేంద్రాలను మూలన పడేశారన్నారు. చెత్తపై పన్ను వేసిన ఘనత జగన్ దేనన్నారు. చెత్త పన్ను పేరుతో ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేశారన్నారు. 2019 లో అధికారం లోకి వచ్చిన సీఎం చంద్రబాబు చెత్త నుంచి సంపద సృష్టించేలా చర్యలు తీసుకున్నారన్నారు. మూలనపడిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగం లోకి తీసుకొచ్చారన్నారు. గ్రీన్ అంబాసిడర్ల చేత ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. తడి చెత్తతో సేంద్రీయ ఎరువులు సేకరించి, రైతులకు విక్రయిస్తూ పంచాయతీలకు ఆదాయం మార్గం చూపారు. పొడి చెత్తను సైతం రీ సైక్లింగ్ చేస్తూ ఆదాయ వనరుగా మార్చారు. పొడి చెత్తకు నిత్యావసర వస్తువులు. గ్రామాల్లో ఇంటింటి నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ప్యాకెట్లు, గాజు సీసాలు, పాత పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, నూనె డబ్బాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇనుము, స్టీల్, అల్యూమినియం వంటి పొడి చెత్త సేకరణకు స్వచ్ఛ రథాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని ఇన్చార్జి మంత్రి సవిత వెల్లడించారు. ఈ రథాల ద్వారా పొడి చెత్తను కేజీల రూపంలో తీసుకుని, వాటికి విలువ కట్టి, 20 రకాల నిత్యావసర వస్తువులను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. కేజీ ప్లాస్టిక్ విలువను రూ.20 లుగా నిర్ణయించామన్నారు. ఇళ్లలో పనికిరాని పొడి చెత్తకు విలువకట్టి నిత్యావసర వస్తువులు అందజేస్తున్నామన్నారు. చెత్తకు కూడా విలువ కట్టి, ఆదాయ వనరుగా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుదే నన్నారు. అంతకు ముందు స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణా చైతన్యరెడ్డి నడపగా, మంత్రి సవిత పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. సేకరించిన చెత్తకు మంత్రి సవిత నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

హెటెరో డ్రగ్స్ ప్రమాదం పై సమగ్ర విచారణ చేయాలి

ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి డిమాండ్.

పరవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: హెటిరో డ్రగ్స్ ప్రమాదం పై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫార్మాసిటీస్ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం పరవాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెటెరొ డ్రగ్స్ ప్రమాదంలో భద్రతా ప్రమాణాల యొక్క వైఫల్యం, డొల్లతనం మరోసారి బయటపడిందని అన్నారు. శుక్రవారం పరిశ్రమలో స్లాబ్ కూలి అసిస్టెంట్ మేనేజర్ మృతి చెందడం విచారకరమన్నారు. మృతి చెందిన ఉద్యోగికి కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని యాజమాన్యం పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. మరో సీనియర్ మేనేజర్ స్వల్పంగా గాయపడటం చూస్తూ ఉంటే కనీసం పరిశ్రమలో భవనాలు యొక్క స్థితిగతులను కూడా యాజమాన్యం ఎప్పటికప్పుడే పరిశీలించడం లేదని అర్థమవుతుందన్నారు. యాజమాన్యం పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీ కార్మిక శాఖ అధికారులు ఈ పరిశ్రమలో విచారణ చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్ రాము, జి దేముడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ హీరోలు రాబోతున్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.

- ఏఐతో సినిమాలు తీసే రోజులు వస్తాయి.
- కృత్రిమ మేధ ప్రపంచ భవిష్యత్తును శాసించబోతోంది.
- ఏఐ నైపుణ్యాలతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు.
- విద్యా, ఉపాధి అవకాశాల్లో ఏలూరు విద్యార్థులు ముందుండాలనే లక్ష్యంతోనే ఏఐ పాఠాలు.

ఏలూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: హీరోలు, నటులు నటించాల్సిన అవసరం లేకుండా ఏఐ టెక్నాలజీతో ఒరిజినల్ నటుల రూపు రేఖలతోనే క్యారెక్టర్లను తయారుచేసి వాటితోనే సినిమాలు తీసే రోజులు త్వరలోనే వస్తాయన్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. శనివారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్ ను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు విద్యార్థులు కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం లోని యువతకు విద్యతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే విధంగా కృత్రిమ మేధ నైపుణ్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఏఐ లాబ్స్ ను ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థి దశ లోనే యువతకు ఏఐ నైపుణ్యాలు అందించేందుకు ఏలూరు పార్లమెంట్ పరిధిలో 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 4 ప్రభుత్వ పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబులు ఏర్పాటు చేయించే కార్యక్రమం చేపట్టామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విజన్ కు అనుగుణంగా, ఏలూరు పార్లమెంటు పరిధి లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నైపుణ్యాలు నేర్పించి వారికి ఉన్నత మైన భవిష్యత్తు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. తాను చదువుకునే సమయంలో కంప్యూటర్ నేర్చుకున్నానని, ఇప్పటి విద్యార్థులు కంప్యూటర్ తో పాటు ఏఐ పరిజ్ఞానాన్ని పొందవలసిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో జాబ్ స్కిల్స్ లో ఏఐ పరిజ్ఞానం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. రాబోవు రోజుల్లో రోబోలు, ఏఐ ద్వారానే అన్ని పనులు చేసే పరిస్థితి రాబోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత ఐటీ విద్యా మంత్రి నారా లోకేష్ ల పట్టుదలతో అమరావతిలో ఏర్పాటు కాబోతున్న క్వాంటమ్ వ్యాలీతో ఏపీ రూపు రేఖలు మారనున్నాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. టెక్నాలజీ ఉపయోగించుకుని కొత్త ఆవిష్కరణలు చేసే ప్రతిభ గల విద్యార్థులు ముందుకు వస్తే టాటా ఇన్నోవేషన్ సెంటర్ కి పంపించడం ద్వారా వారి కలలు నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని విద్యార్థులు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సరికొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయిలకు ఎదగాలని కోరుకుంటున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఎమ్మెల్సీ జయమంగళం వెంకట రమణ, కమ్మిలి విఠల్ రావు, స్థానిక నేతలు, ఓఆర్ఆర్సి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములలో అభ్యంతరం లేని ఆక్రమణల క్రమబద్ధీకరణ.

వీటిపై రెవెన్యూ అధికారులు పూర్తి దృష్టి సారించాలి.

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.

విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 08: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెగ్యులరైజేషన్ (క్రమబద్ధీకరణ) ప్రక్రియ లో భాగంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాల సమావేశం మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తో కలసి జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసిల్దార్లు, ఆర్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెగ్యులరైజేషన్ (క్రమబద్ధీకరణ) ప్రక్రియ, పట్టాల పంపిణీ పై అధికారులు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో ఉన్న అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. క్రమ బద్ధీకరణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని అర్హత కలిగిన దరఖాస్తులకు సంబంధించి ఈ నెల 18 వ తేదీ లోగా పట్టాలు పంపిణీకి సిద్ధం చేయాలని మిగిలిన వాటిని ఈ మార్చి 31 వ తేదీ లోగా పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ భూములను అనధికారికంగా ఆక్రమించి నిర్మించిన ఇళ్లు లేదా చేసుకున్న సాగును, నిర్దిష్ట రుసుము చెల్లించి చట్ట బద్ధం చేయడానికి, క్షేత్రస్థాయిలో ఉన్న అడ్డంకులను తొలగించి లబ్ధిదారులకు వారి బకాయిల వివరాలను తెలియజేస్తూ నోటీసులు పంపించడం, పాక్షికంగా చెల్లింపులు చేసిన దరఖాస్తుదారుల పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. చెల్లింపులు క్లియర్ కాని దరఖాస్తుదారుల కోసం ప్రత్యేక బృందాల ద్వారా క్రమబద్ధీకరణ పై అవగాహన కలిగించాలన్నారు. జీవో 388 పరిధిలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించని యెడల వారిని జీవో 388 పరిధి నుంచి తొలగించి, వారిని జీవో 30 కింద కొత్తగా దరఖాస్తు చేసుకోమని సూచించాలని స్పష్టం చేశారు. గాజువాక ప్రాంతంలో జీవో 45 కింద ఆమోదం పొందిన దాదాపు 1,000 పట్టాలను సిద్ధం చేసి, ఈ నెల 18 వ తేదీ నాటికి పంపిణీకి సిద్ధంగా ఉంచాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. జీవో 296, 388 కింద ఉన్న కన్వేయన్స్ డీడ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, సుమారు 2,000 కన్వేయన్స్ డీడ్లను మార్చి నెలాఖరు కల్లా పూర్తి చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఉన్న పెండింగ్ పనులను ఈ నెల చివరి నాటికి ప్రాథమికంగా ముగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జీవో 84, 27 ప్రకారం యు ఎల్ సి భూముల పై అధికారులతో సమీక్షించారు. అదే విధంగా 22 ఏ డీ-నోటిఫికేషన్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్స్ పై కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఇప్పుడు గొప్ప స్థానాల్లో ఉన్న వారు ఒక్కప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే.

- విద్యార్థులకు పట్టుదల, క్రమశిక్షణ అవశ్యం.
- కొండపల్లి బాలికోన్నత పాఠశాల అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ.
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు.

కొండపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: ప్రతి ఒక్క విద్యార్థిని పట్టుదల, క్రమశిక్షణతో చదువు కోవాలని, పబ్లిక్ పరీక్షలకు సమయం ఎంతో లేదు కావున పట్టుదల, ఏకాగ్రత, ప్రణాళికాబద్ధంగా చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు. కొండపల్లి లోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 36 వ వార్షికోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తో కలసి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శనివారం పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జాతీయ గేయాన్ని ఆలపించారు. పాఠశాల మైదానంలో విద్యార్థినుల ప్రత్యేక పేరేడ్ కార్యక్రమం తిలకించారు. పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ స్వంత నిధులు వెచ్చిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కి కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థినులు ప్లే కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ కొండపల్లి బాలికల జెడ్పి హైస్కూలుకు అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు పేర్కొన్నారు. డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణానికి ఏపిహెచ్ఎంఈఎల్ నుంచి సి.ఎస్.ఆర్ నిధులు రూ.25 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం పెయింటింగ్ వర్క్ తుదిదశకు చేరుకున్నాయన్నారు. మైదానం చదును చేయడం, సివిల్ వర్క్ పనులు కూడా జరుగుతున్నాయన్నారు.

విద్యార్థినులలో ఆరోగ్యకర మైన పోటీతత్వం పెంచాలన్నారు. ఇప్పుడు గొప్ప స్థానాల్లో ఉన్నవారంతా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారని అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, తను కూడా గవర్నమెంట్ స్కూళ్లలోనే చదువుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో నియోజకవర్గంలో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇచ్చే కార్యక్రమం ఇక్కడే నిర్వహిస్తామని, ఈ పాఠశాల నుంచి కూడా ఎక్కువమంది విద్యార్థినులు బాగా ప్రతిభ కనబర్చి ఇందులో భాగస్వామ్యం కావాలని అన్నారు. విద్యతో పాటు సంస్కారం, నైతికత ముఖ్యమన్నారు. ఆ దిశగా విద్యాబోధన జరగాలన్నారు. ఉపాధ్యాయులు మరింత బాధ్యత వహించాలన్నారు. మంచిగా చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిల్లలకు సూచించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా వారి పిల్లల చదువు గురించి బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. విద్యావ్యవస్థలో పెనుమార్పులతో నో వేకెన్సీ బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు చేరుకున్నాయని, ఆస్థాయికి ఈ పాఠశాల కూడా చేరుకోవాలన్నారు. విద్యకు పేదరికం అడ్డు కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలల్లో పుస్తకాలు, యూనిఫామ్, ఆహారం, మౌలిక వసతులు, బోధన, మరుగుదొడ్ల నిర్వహణ అన్నీ సౌకర్యాలు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థినులకు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు సౌజన్యంతో సమకూర్చిన క్రీడాసామగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా చర్యలు.

పిల్లల ఇళ్లకు ఉపాధ్యాయులు.

మునగపాక, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: వచ్చే నెలలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలల్లో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా తోటాడ జెడ్పి హైస్కూలు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి తోటాడ, గవర్ల అనకాపల్లి, సిరసపల్లి, మూలపేట, నారాయుడుపాలెం గ్రామాల్లోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వచ్చే పిల్లలు చదువుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పిల్లల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నదాని పై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యా శాఖ, జిల్లా కలెక్టర్ సూచన మేరకు తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఇంచార్జి ప్రధానోపాధ్యాయిని ఎస్వివి పద్మ తెలిపారు. ఉదయం పూట కొన్ని ప్రాంతాలు, రాత్రి వేళల్లో కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకొని పిల్లల ఇళ్లకు వెళ్తున్నామని చెప్పారు. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ పిల్లల్లో ధైర్యాన్ని నింపుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తీసుకున్న చొరవను ఆయా గ్రామాల పెద్దలు, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రామచంద్రరావు, కెజెబి అంబేద్కర్, కె.కృష్ణారావు, వి.సూర్య ప్రకాశరావు, జి.లక్ష్మీ నరసమ్మ, కె.అరుణ్ కుమార్, ఎం. గిరి కుమారి, కె.రాణి,ఆర్.దేవకి, ఎస్.పెద్దింటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నికేతన్ లో ఉచిత వైద్య పరీక్షలు

అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: స్థానిక ప్రశాంతి నికేతన్ ఎం. వి.వి. ఎస్ మూర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్కూల్ కరెస్పాండంట్ దొడ్డి శ్రీనివాస రావు, దొడ్డి చంద్రశేఖర్ రావు ఉచిత వైద్య పరీక్ష శిభిరాన్ని నిర్వహించారు. కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు వికాస్ పాండే శిభిరాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు, స్థానికులకు దంత, కంటి, ఇతర రక్త పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు డి .శ్రీనివాస రావు, ఎం బాల కుమారి, వైద్యులు టెక్నిషన్స్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసానికి గురైతే బ్యాంకే డబ్బులు ఇస్తుంది...ఆర్బీఐ సంచలన నిర్ణయం.

ఇంటర్నెట్ డెస్క్: డిజిటల్ విప్లవం పుణ్యమా అని బ్యాంకింగ్ సేవలు మన అరచేతిలోకి వచ్చేశాయి. కానీ, అదే స్థాయిలో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు కూడా పెరిగిపోయాయి. అకౌంట్‌లో డబ్బులు మాయమవ్వడం ఒకెత్తయితే, లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులు మరొక ఎత్తు. సామాన్య ఖాతాదారుడు ఎదుర్కొంటున్న ఇలాంటి అనేక సమస్యలకు చెక్ పెడుతూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించిన కొత్త ప్రతిపాదనలు బ్యాంకింగ్ రంగం రూపురేఖలను మార్చడమే కాకుండా, ఖాతాదారులకు కొండంత అండగా నిలవనున్నాయి. ఆన్‌లైన్ మోసం జరిగితే మీ డబ్బులు వెనక్కి డిజిటల్ లావాదేవీల సమయంలో జరిగే చిన్న చిన్న మోసాల వల్ల సామాన్యులు తమ కష్టార్జితాన్ని కోల్పోతున్నారు. ఇక పై అలాంటి భయం అవసరం లేదు. స్మాల్ వాల్యూ ఫ్రాడ్ ట్రాన్సాక్షన్ ఫ్రేమ్‌వర్క్ కింద, అనాథరైజ్డ్ లావాదేవీలు జరిగితే ఖాతాదారులకు గరిష్టంగా రూ.25,000 వరకు పరిహారం అందించేలా ఆర్‌బీఐ కొత్త నిబంధనలు రూపొందిస్తోంది. అంటే మీ ప్రమేయం లేకుండా మీ ఖాతా నుంచి చిన్న మొత్తంలో డబ్బు మాయమైతే, ఆ నష్టాన్ని బ్యాంకే భరించాల్సి ఉంటుంది. దీనివల్ల సామాన్య ప్రజలకు డిజిటల్ బ్యాంకింగ్ పై నమ్మకం మరింత పెరుగుతుంది. రికవరీ ఏజెంట్ల వేధింపులకు చరమగీతం లోన్ కట్టడం ఆలస్యమైతే చాలు, రికవరీ ఏజెంట్లు చేసే ఫోన్ కాల్స్, ఇంటికి వచ్చి చేసే గొడవలు ఖాతాదారులను మానసిక క్షోభకు గురిచేస్తున్నాయి. దీని పై ఆర్‌బీఐ సీరియస్ అయ్యింది. రికవరీ ఏజెంట్ల నియామకం, వారు పనిచేసే విధానం పై కఠినమైన మార్గదర్శకాలను సమీక్షిస్తోంది. కస్టమర్లను భయభ్రాంతులకు గురిచేయడం, అగౌరవంగా ప్రవర్తించడం ఇక పై చెల్లదు. బ్యాంకులే నేరుగా ఈ ఏజెంట్ల ప్రవర్తనకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒకవేళ ఏజెంట్లు నిబంధనలు అతిక్రమిస్తే సదరు బ్యాంకుల పై ఆర్‌బీఐ భారీ జరిమానాలు విధించనుంది. మిస్-సెల్లింగ్ కు చెక్.. చిన్న వ్యాపారులకు వరం బ్యాంకు సిబ్బంది తమ టార్గెట్ల కోసం కస్టమర్లకు అవసరం లేని ఇన్సూరెన్స్ పాలసీలు, మ్యూచువల్ ఫండ్స్ లేదా ఇన్వెస్ట్మెంట్ ప్రొడక్టులను బలవంతంగా అంటగడుతుంటారు. దీనినే మిస్-సెల్లింగ్ అంటారు. దీనిని అరికట్టడానికి ఆర్‌బీఐ కఠినమైన డ్రాఫ్ట్ గైడ్‌లైన్స్‌ను తీసుకువస్తోంది. ఇకపై బ్యాంకు ఏ ప్రొడక్ట్ అమ్మాలన్నా కస్టమర్‌కు పూర్తి సమాచారం ఇవ్వాల్సిందే. మరోవైపు, చిన్న తరహా పరిశ్రమల కోసం షూరిటీ లేదా గ్యారెంటీ లేని లోన్ల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచాలని ప్రతిపాదించింది. దీనివల్ల చిన్న వ్యాపారులు తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి సులభంగా పెట్టుబడి దొరుకుతుంది.

నక్కపల్లి హైస్కూల్లో అలరించిన ఏక్ భారత్- శ్రేష్ఠ భారత్

నక్కపల్లి, పెన్ సత్తా ఫిబ్రవరి 07: మండల కేంద్రం నక్కపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం పి విజయ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధ దేశభక్తుల వేషధారణలు అలరించాయి. ఆచార వ్యవహారములు, ఆహారపు అలవాట్ల వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వివిధ రాష్ట్రాల సృజనాత్మకతను జోడించి వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయుటకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, శ్రీనివాస్, మహలక్ష్మి, జాస్మిన్, భవ్య తదితర ఉపాధ్యాయులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పలు శంకుస్థాపన కార్యక్రమంలో పెమ్మసాని

ప్రత్తిపాడు, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: నియోజకవర్గం లోని బోయపాలెం తుమ్మలపాలెం గ్రామ పంచాయతీలో డిస్ట్రిక్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ డైట్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మాణానికి గాను స్థానిక ఎమ్మెల్యే బి రామాంజనేయులుతో కలిసి గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం శంకుస్థాపన నిర్వహించారు. గుంటూరులో టీచర్లకు అత్యాధునిక శిక్షణ అందించేందుకుగాను డిస్ట్రిక్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (డైట్) సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ప్రతి రంగంలో నాణ్యమైన వ్యవస్థ అవసరమని, ముఖ్యంగా విద్యా రంగంలో టీచర్లకు ఆధునిక, నిరంతర శిక్షణ కీలకమని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న సమగ్ర శిక్ష పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మూడు డైట్ సెంటర్స్ ఫర్ ఎక్సలెన్స్ మంజూరయ్యాయని చెప్పారు. గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కో సెంటర్ కు రూ.13 నుంచి 15 కోట్ల వరకు ఆమోదం లభించిందని వివరించారు.

గుంటూరులో నిర్మించబోయే డైట్ సెంటర్ సుమారు 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 3 - 4 భవనాలతో నిర్మించనున్నామని తెలిపారు. ఇందులో ప్రధాన శిక్షణ భవనం, హాస్టల్, సిబ్బంది క్వార్టర్స్‌తో పాటు ఆధునిక డిజిటల్ క్లాస్‌రూమ్స్, కంప్యూటర్లు, నెక్స్ట్ జనరేషన్ శిక్షణ పరికరాలు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే టీచర్లు ఇక్కడ హాస్టల్ సదుపాయంతో శిక్షణ పొందేలా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయనున్నామని, నిరంతర శిక్షణ అందించే కేంద్రంగా ఇది పనిచేస్తుందని తెలిపారు. గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాల విద్యా వ్యవస్థకు ఈ డైట్ సెంటర్ కీలకంగా సేవలందించనుందని చెప్పారు. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా, కనీసం వంద సంవత్సరాలు నిలిచేలా నాణ్యమైన నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించినట్లు తెలిపారు.

నూకాంబికను దర్శించుకున్న లారెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారిని దేవస్థానంలో లారెన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి వి రవికుమార్ అమ్మవారి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారిని దర్శించుకున్న ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, యర్రవరపు సంతోష్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పదిలో సత్ఫలితాలు ఇస్తున్న 100 రోజుల ప్రణాళిక

ఎంపీడీవో బి.చైతన్య



నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: పదవ తరగతి విద్యార్థులకు పాఠశాలల్లో అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళిక సత్ఫలితాలు ఇస్తుందని ఎంపీడీవో బి చైతన్య అన్నారు. శనివారం చినదొడ్డిగల్లు హైస్కూలులో పదవతరగతి విద్యార్థులతో ఆమె ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వందరోజుల యాక్షన్ ప్లాన్ ననుసరించి పలు ప్రశ్నలను అడుగగా విద్యార్థులందరూ ఉత్సాహంగా సమాధానాలు చెప్పడంతో వారిని అభినందించారు.గతంలో తాను పాఠశాలను సందర్శించిన సమయంలో కంటే ప్రస్తుతం విద్యార్థులలో షైనింగ్ స్టార్ సంఖ్య పెరిగిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.తల్లిదండ్రులతో అవకాశాన్ని బట్టి ఇండ్లకు వద్దకు వెళ్లి విద్యార్థుల ప్రగతిపై చర్చించాలన్నారు.పరీక్షలకు నెల సమయం ఉండడంతో టీవీలు చూడవద్దని,పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంపట్ల కూడా శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎమ్ వి.బాలాజీ, నోడల్ హెచ్.ఎమ్ వేమగిరి నూకరాజు లు పాల్గొన్నారు.

విద్యాంజలి పై శిక్షణా తరగతులు

మండలవిద్యాశాఖాధికారి కే.నరేష్

నక్కపల్లి, పెన్ సత్తా ఫిబ్రవరి 07:పలుపాఠశాలల్లో అమలవుతున్న విద్యాంజలి కార్యక్రమంపై శనివారం చినదొడ్డిగల్లు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహనా శిక్షణాతరగతులను నిర్వహించారు. మండలవిద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక మండలపరిషత్ అభివృద్ధి అధికారి బి.చైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులలో విజ్ఞానం,వికాసాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన విద్యాంజలి 2.0 పథకం విజయవంతంగా జరుగుతుందన్నారు. విద్యాంజలి కార్యక్రమం ద్వారా వాలంటరీ వ్యవస్థ విద్యామంత్రిత్వశాఖ వేదికగా పనిచేస్తుందని,ముఖ్యంగా వాలంటరీ వ్యవస్థ బలోపేతం చేయడమే దీని ప్రధాన ఉద్దేశ్యమని ఆమె పేర్కొన్నారు.అనంతరం నోడల్ ప్రధానోపాధ్యాయులు వేమగిరి నూకరాజు మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతోనే పాఠశాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ తరగతులను సెషన్ లు వారీగా నిర్వహించి ప్రధానోపాధ్యాయుల సందేహాలను నివృత్తిచేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 రుత్తల నాగన్నదొర,స్థానిక హైస్కూల్ హెచ్.ఎమ్ వి.బాలాజీతో పాటు మండలంలో అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,సి.ఆర్.పీ లు డి.అప్పారావు,శేఖర్, దేవి,జ్యోతి అప్పలనాయుడు,గంగేశ్వరరావు లు పాల్గొన్నారు.

అంబటికి అండగా ఉమ్మడి విశాఖ వైసీపీ కాపు నేతలు : చలో గుంటూరు

నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి07: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి కాపు నేత అంబటి రాంబాబు అక్రమ అరెస్ట్ నిరసిస్తూ ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ కాపునేతలు శనివారం చలో గుంటూరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి విశాఖ, అనకాపల్లి జిల్లాల నుండి సుమారు 200 కార్లలో వైసిపి కాపు నేతలు గుంటూరు తరలి వెళ్లి అంబటి రాంబాబు కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. నక్కపల్లి లో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వేసం రామకృష్ణ ఆధ్వర్యంలో వైసీపీ కాపు నేతలు భారీగా గుంటూరు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వైసీపీ నేతలపై చేస్తున్న అక్రమ అరెస్ట్ లను తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం మొదటి నుండి కాపులను అణగదొక్కి అణిచివేసే కార్యక్రమమే టీడీపీ ఎజెండాగా పెట్టుకుందన్నారు. కాపు ఉద్యమ నేతలు

వంగవీటి మోహనరంగా హత్య, ముద్రగడను జైలు పాలుచెయ్యడం, నేడు అంబటి ని అక్రమంగా అరెస్టు చేయడం, రాజకీయంగా కాపులను అనగా తొక్కడంమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. గుంటూరు వెళ్లిన వారిలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ,వెలగా ఈశ్వరరావు, నాయకులు పొడకట్ల పాపారావు, కొప్పిశెట్టి హరి, సూరకాసుల గోవిందు,తల్లా భార్గవ్, వీసం రాజు, సాదిరెడ్డి శ్రీను, తిరుపతిరావు, కొల్లాటి బుజ్జి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండి.

అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 07: ఏపీఈపీడీసీఎల్ పరిధి లోని విద్యుత్ సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండి' విధానాన్ని సంస్థ ప్రవేశపెడుతుంది అని అనకాపల్లి ఏపీఈపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీరు గొప్పు ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 9 వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించనున్న డయల్ యువర్ సీఎండి కార్యక్రమాన్ని సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏ ఎస్ ఆర్ పాడేరు, రాజమహేంద్రవరం, కాకినాడ, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఫోన్ నంబరు 8688400499 ద్వారా విద్యుత్ సంబంధిత సమస్యలను తెలియజేయవచ్చని వెల్లడించారు. విశాఖపట్నం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ సీఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండి గారి దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పర్యవేక్షక ఇంజినీరు గొప్పు ప్రసాద్ విజ్ఞప్తి చేసారు.

ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన, హౌసింగ్ ఏ ఈ రియాజుద్దీన్

చేగుంట పెన్ సత్తా, ఫిబ్రవరి 07/చేగుంట మండల్ చందాయిపేట్ గ్రామంలో మండల హౌసింగ్ ఏ ఈ, రియాజుద్దీన్ శనివారం సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణలను పరిశీలించారు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణంలో వాడవలసిన ఇసుక,, కంకర, సిమెంట్, సలాక, ఏ పనిని ఎలా, కలిపి వాడాలనే దానిపై లబ్ధిదారులకు తెలియజేశారు, ప్రభుత్వ నిబంధన ప్రకారం పనులు జరుపుకుంటే బిల్లులువేనూ వెంటనే బిల్లులు రావడానికి తాను కృషి చేస్తానని లబ్ధిదారులకు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్,సెక్రటరీ కృష్ణ, కారోబార్ ఎల్లమేశ్వర్,లబ్ధిదారులు సాజీద్, తదితరులు పాల్గొన్నారు.

సుపోషణతో ఆరోగ్యకర జీవనం జగన్నాధపురంలో అవగాహన కార్యక్రమం

చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 07ప్రతినిధి.చింతకాని మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామ అంగన్వాడి కేంద్రంలో ఈరోజు సుపోషణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తాళ్లూరి స్వప్న ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పాలు, గుడ్లు, పిండి వంటి పోషకాహారాన్ని గర్భిణీ స్త్రీలు, బాలింతలు క్రమం తప్పకుండా

తీసుకోవాలని సూచించారు. తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు ఆకుకూరలు మరియు పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి నెల అవసరమైన టీకాలు, ఇంజక్షన్లు తీసుకోవడం ద్వారా తల్లిశిశు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌వి రేచర్ల రాణి, ఏఎన్ఎం రజిని, వార్డు సభ్యులు తన్నీరు

రమాదేవి, అంగన్వాడీ టీచర్ కాశీమల వెంకమ్మ, ఆశా వర్కర్ బందెల అరుణ, ఆయా యర్రమల పద్మతో పాటు గ్రామ ప్రజలు, చిన్నారులు పాల్గొన్నారు.

బావి మరమ్మతులు చేపిస్తున్న సర్పంచ్ చాపల మడుగు వీరబాబు...

చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 07 ప్రతినిధి. చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలో గిరకి బావిలో చెట్ల కొమ్మలు, ఆకులు పడటం వల్ల నీరు కలుషితమై, పూడిక పేరుకుపోతుంది. తద్వారా నీటి నాణ్యత తగ్గి ప్రమాదకరంగా మారుతుంది. ఈ ఆకులు కుళ్లిపోయి నీటిలో ఆక్సిజన్ స్థాయిలను తగ్గిస్తాయి ఫలితంగా బావి దుర్వాసన వస్తుంది దీనిని నివారించడానికి, క్రమం తప్పకుండా పూడికతీత చేపట్టడం మరియు బావిపై రక్షణ జాలీ (నెట్) ఏర్పాటు చేయడం ఉత్తమం అని బావి అడుగున చేరిన కొమ్మలు, ఆకులు, బురదను తొలగించాలి నీటిని తోడేసి, సున్నం లేదా పొటాషియం పర్మాంగనేట్ వంటి క్రిమిసంహారకాలను ఉపయోగించి బావిని శుభ్రం చేయాలి బావి పైభాగంలో ఇనుప జాలీ లేదా పందిరిని ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో ఆకులు పడకుండా నివారణ చేయాలి బావిలోని నీటిని తిరిగి తాగడానికి లేదా ఇతర అవసరాలకు ఉపయోగకరంగా వాడుకోవాలని గ్రామ సర్పంచ్ గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ని కలిసిన కేతేపల్లి భాస్కరరావు ..

పెన్ సత్తా, ఫిబ్రవరి 07తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు ఆర్యవైశ్య నాయకులు కేతేపల్లి భాస్కరరావు డిప్యూటీ

సీఎం మల్లు భట్టి విక్రమార్క ని వారి స్వగ్రామం లక్ష్మీపురంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు దివంగత మల్లు అనంత రాములు వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ని కలుసుకొని ఆయన తో

ముచ్చటించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం తల్లాడ మండల రాజకీయ విషయాలు

అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మేజర్ గ్రామపంచాయతీలు

ఓడిపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అందుకు కేతేపల్లి వివరణ ఇస్తూ మండలంలో కాంగ్రెస్ పార్టీ సమన్వయ లోపంతో కొన్ని మేజర్ గ్రామపంచాయతీలు

ఓడిపోవడం జరిగిందని అన్నారు. అనంతరం తల్లాడను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరారు. రింగురోడ్డు ఆధునీకరణ, సెంట్రల్ లైటింగ్,డివైడర్, జూనియర్ కాలేజీ, గవర్నమెంట్ హాస్పిటల్ ను ఆధునికరించి డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని అదేవిధంగా హాస్పటల్లో

20 పడకలు ఏర్పాటు చేయాలని, 24 గంటలు వైద్య సదుపాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ని వారు కోరారు. అందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగలరని ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తెలంగాణ రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ , కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బొడ్డు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు .

అంగరంగ వైభవంగా శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం.

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ కమిటీ చైర్మన్.
- పెద్ద ఎత్తున హాజరైన భక్తులు.

వలిగొండ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 07 యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ముద్దాపురం గ్రామంలో శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య అంగరంగ వైభవంగా జరిగింది పండితుల ఆశీర్వచనాలు సన్నాయి వాయిద్యాల నడుమ అర్చక బృందం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు కళ్యాణోత్సవానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి శ్రీ మత్స్యగిరిగుట్ట ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను ఆలయ కమిటీ చైర్మన్ వాకిటి కొండల్ రెడ్డి సమర్పించారు విగ్రహాల దాత సామ బాల్ రెడ్డి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు గోవింద నామ స్మరణతో ఆలయం మార్మోగింది వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం యూత్ సభ్యులు ఏర్పాటు చేసినారు.

అనంతరం కొడితాల అలివేలు అశోక్ గుప్తా దంపతులు కొణితల శ్రీకాంత్ నిమిషా దంపతులు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర నిర్వహించారు.

గ్రామ యువకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సామ సరస్వతి రాంరెడ్డి విగ్రహ దాత సామ బాల్ రెడ్డి మాజీ ఎంపీటీసీ సామ రాంరెడ్డి ఆలయ కమిటీ వైస్ చైర్మన్ సామ నర్సిరెడ్డి ధర్మకర్తలు వాకిటి గంగిరెడ్డి వాకిటి శ్రీనివాస్ రెడ్డి వాకిటి వెంకట్ రెడ్డి గుంటోజు యాదాచారి సామ నవీన్ రెడ్డి పిన్నింటి ధర్మారెడ్డి మాద సోమయ్య గౌడ్ ఆవుల అనిల్ యాదవ్ మీసాల కృష్ణ నాయకులు పులిపల్పుల రాములు గౌడ్ నరసింహ గ్రామ ప్రజలు యువకులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు
PEN SATTA Telugu Daily

ఎడిటోరియల్

మహిళల్లో సున్తీ ని నిషేధించాలని ఐక్యరాజ్య సమితి ఎందుకు అంటోంది?

ప్రపంచ జనాభాలో ప్రతి 20 మంది మహిళల్లో (బాలికలు సహా) ఒకరు 'సున్తీ' అనే ఆచారానికి బాధితులేనని ఐక్యరాజ్య సమితి అంచనా. 'సున్తీ' చేయడం అంటే మహిళల జననేంద్రియంలో క్లైటోరిస్ అనే భాగాన్ని కత్తిరించడం. దీన్నే ఆంగ్లంలో 'ఫీమేల్ జెనిటల్ మ్యూటిలేషన్' (ఎఫ్‌జీఎం)గా వ్యవహరిస్తున్నారు. ఈ ఆచారాన్ని పాటించే కుటుంబాల్లో చాలావరకు ఊహ తెలియని వయసు లోనే (ఆరు, ఏడేళ్లప్పుడే) బాలికలకు 'సున్తీ' చేస్తారు. కొందరికి యుక్త వయసొచ్చాక చేస్తారు. శారీరకంగా, మానసికంగా మహిళల్లో జీవితాంతం అది ప్రభావం చూపుతుంది. వారి లైంగిక జీవితం పై ప్రభావం చూపుతుంది. స్త్రీ జననేంద్రియం భాగాన్ని కోసివేయడం లేదా చర్మాన్ని తొలగించడాన్ని ఎఫ్‌జీఎంగా వ్యవహరించాలి అని ఐక్యరాజ్య సమితి నిర్వచించింది. అలా చేయడాన్ని మానవ హక్కుల ఉల్లంఘన చర్యగా ఐక్యరాజ్యసమితి పరిగణిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఎఫ్‌జీఎం పద్ధతికి ముగింపు పలుకుతూ, 2012 డిసెంబర్‌లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించింది. దానిని పూర్తిగా నిర్మూలించేందుకు, అందుకోసం ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు యేటా ఫిబ్రవరి 6 ను 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ జీరో టోలరన్స్ ఫర్ ఎఫ్‌జీఎం'గా జరుపుకోవాలని పిలుపునిచ్చింది. స్త్రీ జననేంద్రియ భాగాల్ని తొలగించడం...స్త్రీ జననేంద్రియంలో వెలుపలి భాగాన్ని కోసివేయడం లేదా చర్మాన్ని తొలగించడాన్ని 'ఫీమేల్ జెనిటల్ మ్యూటిలేషన్' (ఎఫ్‌జీఎం)గా వ్యవహరించాలి అని ఐక్యరాజ్యసమితి నిర్వచించింది. యోని శీర్షం వెలుపలి భాగాన్ని కోసి వేయడం, లేదా అక్కడి చర్మాన్ని తొలగించడం 'సున్తీ' లో భాగమే. 'సున్తీ' చేస్తున్నప్పుడు కనీసం మత్తు మందు కూడా ఇవ్వరు. పూర్తి స్పృహలో ఉన్నప్పుడే అమ్మాయిలు తీవ్రమైన నొప్పిని భరించాల్సి ఉంటుంది. బ్లేడ్, కత్తి ఉపయోగించి నాటు పద్ధతిలో 'సున్తీ' చేస్తుంటారు. ఆ తర్వాత నొప్పి నుంచి ఉపశమనం కలిగించేందుకు పసుపు, వేడి నీళ్లు, సాధారణ పైపూత మందును వాడుతారు.

ఎఫ్‌జీఎం అనేది చాలా బాధాకర మైన విషయమని, ఈజిప్ట్‌కు చెందిన సినీ నిర్మాత, బ్లాగర్ ఒమ్నియా ఇబ్రహీం అన్నారు. ఒక ఐస్ ముక్కలా మారిపోతాం. ఎలాంటి భావాలూ ఉండవు. ప్రేమ అనే అనుభూతి ఉండదు. అన్నీ కోల్పోయినట్లుగా అనిపిస్తుంది అని ఈజిప్టుకు చెందిన సినీ నిర్మాత ఓమ్నియా ఇబ్రహీం చెప్పారు. ఓమ్నియా కూడా ఎఫ్‌జీఎం బాధితురాలే. అది జరిగిన తర్వాత మానసికంగా ఎంతగానో కుంగిపోయాను. లైంగికంగా కోరికలు నశించిపోయాయి. దాంతో, ఇక నేను సెక్స్‌కి పనికిరానేమో అని అనుకునేదాన్ని. ఆ బాధ నుంచి బయటపడేందుకు నాకు ఎన్నో ఏళ్లు పట్టింది అని ఓమ్నియా వివరించారు. మహిళల యుక్త వయసు మొత్తం పై కూడా ఇది మానసికంగా ప్రభావాన్ని చూపుతుందని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఒమ్నియా చెప్పారు. శరీరమంటే సెక్స్, ఆ సెక్స్ అనేది పాపం అని నా కమ్యూనిటీ నేర్పించింది. మనసులో నా శరీరం ఒక శాపంగా మారిపోయింది అని ఒమ్నియా చెప్పారు. చాలా దేశాల్లో సున్తీ చేయడం చట్టవిరుద్ధం అయినప్పటికీ, ఆఫ్రికా, ఆసియా, మధ్య ప్రాచ్యలో చాలా ప్రాంతాల్లో దీన్ని చేపడుతూనే ఉన్నారు. సున్తీ చేయడం మామూలు విషయమేనని ఇంకా ఈ దేశాలు భావిస్తున్నాయి. కొన్ని దేశాలు దీనిని నేరంగా పరిగణిస్తున్నాయి. సున్తీ(ఎఫ్‌జీఎం) ఎన్ని రకాలు?, సున్తీల్లో నాలుగు రకాలు ఉంటాయి.

టైప్ 1 : క్లిటోరిడెక్టమీ సున్నిత మైన క్లిటోరిస్‌ను, దాని చుట్టూ ఉన్న చర్మాన్ని పాక్షికంగా లేదా పూర్తిగా తొలగించడం.

టైప్ 2: ఎక్సిషన్ క్లిటోరిస్‌ను పూర్తిగా లేదా పాక్షికంగా తొలగించడంతో పాటు, జననేంద్రియ లోపలి ముడుతల్లాంటి భాగాలను కూడా తొలగిస్తారు.

టైప్ 3: ఇన్‌ఫిబ్యులేషన్ జననేంద్రియం లోపలి భాగంతో పాటు వెలుపలి భాగాన్ని కూడా పాక్షికంగా లేదా పూర్తిగా తొలగించి కుట్లు వేస్తారు. కుట్లు వేసేటప్పుడు చిన్న గ్యాప్ ను మాత్రమే ఉంచుతారు. ఈ విధానం తీవ్ర వేదనను, బాధను మిగల్చడమే కాకుండా, వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతోంది. చిన్న గ్యాప్ తో యోనిని, మూత్రాశ్రయాన్ని మూసివేయడంతో, దాని నుంచే రుతుస్రావం, మూత్రం బయటికి వెళ్తుంది. కొన్నిసార్లు ఇది చాలా చిన్నగా ఉండటం వల్ల, లైంగికంగా పాల్గొనేటప్పుడు లేదా పిల్లలకు జన్మనిచ్చేటప్పుడు దాన్ని కోయాల్సి వస్తుంది. ఇది తల్లికి, బిడ్డకు ప్రమాదకరంగా మారుతుంది.

టైప్ 4: ఈ విధానం చాలా ప్రమాదకరం. జననేంద్రియాన్ని పొడవడం, కత్తిరించడం, గీరడం లాంటివి చేస్తారు. సున్తీ వల్ల లైంగికానందం ఉండదు. ఇన్‌ఫెక్షన్, వంధ్యత్వం వస్తాయి.

రాత్రి లైట్ వేసుకుని పడుకుంటున్నారా?



మీకు రాత్రిపూట లైట్లు వెలిగించి నిద్రపోయే అలవాటు ఉందా? చీకటి అంటే భయంతోనో లేదా అజాగ్రత్తతోనో లైట్లు ఆర్పకుండా పడుకుంటున్నారా? అయితే మీరు ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నట్లే.. రాత్రిపూట వెలుతురులో నిద్రపోవడం వల్ల కేవలం నిద్రలేమి మాత్రమే కాదు.. ఊబకాయం, గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్లు కూడా వచ్చే ముప్పు ఉందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. రోజంతా కష్టపడి పనిచేశాక.. హాయిగా నిద్రపోతేనే కదా రేపటి పనులకు శరీరం సిద్ధమయ్యేది.. కానీ చాలామంది రాత్రిపూట లైట్లు వెలిగించి నిద్రపోతుంటారు. చీకటి అంటే భయంతోనో లేదా భద్రతా కారణాలతోనో ఈ అలవాటును కొనసాగిస్తుంటారు. అయితే ఈ చిన్న అలవాటు మీ ప్రాణాల మీదకు తెస్తుందని మీకు తెలుసా..? రాత్రిపూట వెలుతురులో నిద్రపోవడం వల్ల ఊబకాయం నుంచి క్యాన్సర్ వరకు అనేక ముప్పులు ఉన్నాయని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. మంచి నిద్ర కేవలం విశ్రాంతి మాత్రమే కాదు.. అది ఆరోగ్యానికి పునాది. మనం నిద్రపోతున్నప్పుడే మన శరీరం, మనస్సు దెబ్బతిన్న కణాలను సరిచేసుకుంటాయి. సరిగ్గా నిద్ర లేకపోతే చిరాకు, మానసిక ఒత్తిడి కలగడమే కాకుండా.. దీర్ఘకాలంలో గుండె జబ్బులు, మధుమేహం, ఆందోళన వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. మన శరీరంలో సిర్కాడియన్ రిథమ్ అనే ఒక సహజ గడియారం ఉంటుంది. చీకటి పడగానే మన శరీరం మెలటోనిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది మనల్ని గాఢ నిద్రలోకి తీసుకెళ్తుంది. కానీ రాత్రిపూట ప్రకాశవంతమైన వైట్ లైట్లు లేదా మొబైల్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల ఈ హార్మోన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఫలితంగా నిద్ర నాణ్యత తగ్గి, హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. వెలుతురులో నిద్రించడం వల్ల శరీర మెటబాలిజం తగ్గి బరువు పెరుగుతారు. మాటిమాటికీ మేల్కొలుపు రావడం వల్ల నిద్రలేమి సమస్య వేధిస్తుంది. మెలటోనిన్ స్థాయిలు తగ్గడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.ఒకవేళ చీకటిలో నిద్రపోలేకపోతే.. మృదువైన పసుపు లేదా ఆరెంజ్ రంగు లైట్లను వాడండి. ఇవి నిద్రపై తక్కువ ప్రభావాన్ని చూపుతాయి. నేటి వేగవంతమైన జీవితంలో నిద్రను నిర్లక్ష్యం చేయకండి. రాత్రిపూట లైట్లు ఆర్పడం అనే ఒక చిన్న మార్పు మీ ఆరోగ్యాన్ని ఎంతో మెరుగుపరుస్తుంది.

అరటిపండ్లు, ఖర్జూరం తక్షణ శక్తి కోసం ఏది తినాలి?

అలసటను వదిలించుకోవడానికి వ్యాయామం, త్వరగా శక్తిని పొందడానికి చాలా మంది అరటిపండ్లు లేదా ఖర్జూరాలు తీసుకుంటూ ఉంటారు. కానీ వీటిలో ఏది ఉత్తమమో, ఏ సమయంలో ఏది తినాలో తప్పక తెలుసుకోవాలి. తద్వారా మీరు రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరిలో అలసట, బలహీనత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సమస్య ఉదయం నిద్రలేచిన వెంటనే ప్రారంభమైతే.. మళ్లీ రాత్రి నిద్రపోయే వరకు ఉంటుంది. దీనికి అనేక కారణాలు ఉన్నప్పటికీ అటువంటి సమస్యల నుంచి బయటపడటానికి సులభమైన మార్గాన్ని నిపుణులు చెబుతున్నారు. అదేంటంటే.. ఈ అలసటను వదిలించుకోవడానికి వ్యాయామం, త్వరగా శక్తిని పొందడానికి చాలా మంది అరటిపండ్లు లేదా ఖర్జూరాలు తీసుకుంటూ ఉంటారు. కానీ వీటిలో ఏది ఉత్తమమో, ఏ సమయంలో ఏది తినాలో తప్పక తెలుసుకోవాలి. తద్వారా మీరు రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. ఒక అరటిపండులో దాదాపు 105 కేలరీలు ఉంటాయి. ఇందులో కార్బోహైడ్రేట్లు, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. అరటిపండ్లతో పోలిస్తే, ఖర్జూరం కేలరీలు ఎక్కువగా ఉంటాయి. కేవలం మూడు లేదా నాలుగు ఖర్జూరాలు తినడం వల్ల మీకు 90 నుంచి 120 కేలరీల శక్తి లభిస్తుంది. అంతే కాదు వాటిలో ఫైబర్, ఐరన్, మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటాయి. ఎక్కువసేపు వ్యాయామం చేయాలనుకునేవారికి లేదా రోజంతా ఉత్సాహంగా పనిచేయాలనుకునే వారికి, అరటిపండ్లు మంచివి. వాటిలోని ఫైబర్ చక్కెరను నెమ్మదిగా రక్తంలోకి విడుదల చేస్తుంది. తద్వారా ఎక్కువ సమయం శక్తిని అందించడానికి సహాయపడుతుంది. వ్యాయామం తర్వాత అలసిపోయినా లేదా నీరసంగా అనిపించినా తక్షణ శక్తి కోసం ఖర్జూరం తినడం మంచిది. ఎందుకంటే వాటిలో అధిక మొత్తంలో సహజ చక్కెర ఉంటుంది. శరీరానికి వెంటనే గ్లూకోజ్‌ను అందిస్తుంది. అందుకే ఉపవాసం ఉన్నవారు ఖర్జూరాన్ని తినేందుకు ఇష్టపడతారు. కానీ డయాబెటిస్ ఉన్నవారు వీలైనంత వరకు ఖర్జూర వినియోగాన్ని నియంత్రించుకోవాలి. కండరాల తిమ్మిరితో బాధపడేవారు కూడా ఖర్జూరం తినవచ్చు. ఇందులో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది కండరాలు త్వరగా కోలుకోవడానికి సహాయపడుతుంది.

గుండె సమస్యల్ని దూరం చేసే స్ట్రాబెర్రీస్

మనం రోజూ తీసుకునే పసుపు, మిరియాలు, ఆకుకూరలు, క్యారెట్స్, నెయ్యి, అరటిపండ్లు, పల్లీలు ఇవన్నీ కూడా మన అనారోగ్య సమస్యల్ని దూరం చేసి ఆరోగ్యాన్ని కాపాడేవే. అందుకోసమే, కచ్చితంగా వీటిని తీసుకోవాలి. అయితే, తీసుకున్నంత మాత్రాన అవి సరైన విధమైన రిజల్ట్ చూపిస్తుందని లేదు. ఎందుకంటే, అవి హెల్దీ ఫుడ్స్ అయినప్పటికీ వాటిని సరైన విధంగా తీసుకుంటేనే మనం అనుకున్న ఫలితాలని అందిస్తుంది. అందుకోసం ఏయే ఫుడ్స్‌ని ఎలా తీసుకోవాలో హెల్త్ కోచ్ మిరుణ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేస్తున్నారు. పసుపు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలతో పాటు మరెన్నో పోషకాలు ఉంటాయి. అందుకే, దీనిని మన వంటల్లోనూ భాగం చేయడమే కాకుండా ఆయుర్వేదంలోనూ వాడుతుంటారు. అయితే, ఈ పసుపులోని గుణాలన్నింటిని అందుకోవాలంటే మాత్రం పసుపుని నల్ల మిరియాల పొడితో కలిపి తీసుకోవాలి. దీంతో పసుపులోని కర్కుమిన్ అనేది మన శరీరానికి చక్కగా అందుతుంది. ఇది పవర్‌ఫుల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పనిచేసి జాయింట్ పెయిన్స్, కీళ్ళ నొప్పుల వంటివన్నీ దూరమవుతాయి. కాబట్టి, పసుపుని మనం తీసుకున్నప్పుడు అందులో కొద్దిగా మిరియాల పొడిని కలిపి తీసుకోండి. ఇలా తీసుకుంటే దాని పనితీరు 2వేల శాతం పెరుగుతుందట. దీని వల్ల బాడీలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గి నొప్పులు చాలా వరకూ దూరమవుతాయి. క్యారెట్స్ తింటే కళ్ళకి మంచిది. ఇంకా ఎన్నో లాభాలు. అయితే, వీటిని మనం హెల్దీ ఫ్యాట్స్‌తో కలిపి వండి తీసుకున్నప్పుడే ఆ బెనిఫిట్స్ మనకి లభిస్తాయి. అందుకోసం క్యారెట్స్‌ని మనం ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనె, నెయ్యి వంటి హెల్దీ ఫ్యాట్స్‌తో కలిపి వండడం మంచిది. దీంతో క్యారెట్స్‌లోని బీటా కెరోటిన్ బాడీకి అందుతుంది. దీంతో కంటి చూపుకి హెల్ప్ అవ్వడమే కాకుండా చర్మం కూడా ఆరోగ్యంగా మారుతుంది. అరటిపండ్లు, పల్లీలు రెండూ మంచివే. అయితే, వీటిని విడివిడిగా తీసుకునే బదులు కలిపి తీసుకుంటే మంచిది. వీటి కాంబినేషన్ మంచి ప్రోటీన్ రిచ్‌గా మారుతుంది. ఎవరైతే బరువు పెరగాలనుకుంటారో అలాంటి వారు ఈ రెండింటిని కలిపి తీసుకుంటే మంచి రిజల్ట్ ఉంటుంది. అంతేకాకుండా, మజిల్స్ కూడా బాగా పెరుగుతాయి. అదే విధంగా, విటమిన్ సి కోసం ఉసిరిని మన డైట్‌లో యాడ్ చేస్తుంటారు. వీటిని నేరుగా అలానే తీసుకోవడం కంటే తేనెతో కలిపి తీసుకోవాలి. దీంతోపాటు, కొద్దిగా మిరియాల పొడి కలిపి చూడండి. అప్పుడు ఇది సూపర్‌ఫుడ్‌గా మారి బ్రెయిన్ ఫోకస్ పెరిగేలా చేస్తుంది. జ్ఞాపకశక్తిని కూడా పెంచుతుంది. స్ట్రాబెర్రీస్ తీసుకోవడం వల్ల మన బాడీకి యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా అందుతాయి. అయితే, వాటిని నేరుగా తీసుకోవడం కంటే డార్క్ చాక్లెట్‌తో కలిపి తీసుకోవడం మంచిది. దీంతో మనకి యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్ అంది బ్లడ్ ప్రెజర్ తగ్గుతుంది. దీంతో గుండె పనితీరు మెరుగ్గా మారుతుంది. కాబట్టి, ఎప్పుడైనా సరే డార్క్ చాక్లెట్‌ని స్ట్రాబెర్రీస్‌తో కలిపి తీసుకోండి. ఆపిల్స్ తీసుకుంటే డాక్టర్ దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదంటారు. అయితే, అలా ఆపిల్స్‌ని ఊరికే తీసుకోకుండా వాటిపై కొద్దిగా దాల్చినచెక్కపొడి కలిపి తీసుకోండి. దీంతో ఇన్సులిన్ లెవల్స్ మెరుగ్గా మారతాయి. ఎవరైతే షుగర్‌తో బాధపడుతున్నారో వారికి ఈ టిప్ చాలా బాగా హెల్ప్ అవుతుంది. బెస్ట్ కాంబినేషన్‌లా పనిచేసి షుగర్‌ని కంట్రోల్ చేయడానికి హెల్ప్ చేస్తుంది.

టీ20 వరల్డ్ కప్ 2026: అమెరికాపై విజయంతో టీమిండియా శుభారంభం

టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ బోణీ

తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో విజయం

కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అజేయ అర్ధశతకంతో ఆదుకున్న వైనం

భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో అమెరికా కట్టడి

సిరాజ్ మూడు, అర్ష్‌దీప్, అక్షర్ రెండేసి వికెట్లు

ఐసీసీ టీ20 ప్రపంచకప్-2026 ప్రస్థానాన్ని టీమిండియా గెలుపుతో ప్రారంభించింది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా శనివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (84 నాటౌట్) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకోగా, బౌలర్లు సమష్టిగా రాణించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో సూర్యకుమార్ సేన టోర్నీలో శుభారంభం చేసింది.

162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికాకు కూడా సరైన ఆరంభం లభించలేదు. భారత పేసర్లు మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ ధాటికి 13 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. అయితే మిలింద్ కుమార్ (34), సంజయ్ కృష్ణమూర్తి (37) ఆదుకునే ప్రయత్నం చేశారు. చివర్లో శుభమ్ రంజనే (22 బంతుల్లో 37) మెరుపులు మెరిపించి కాసేపు ఉత్కంఠ రేపాడు. కానీ, భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి అమెరికాను పుంజుకోనీయలేదు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ 3 వికెట్లు పడగొట్టగా, అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో అమెరికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 132 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అమెరికా ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. ఇషాన్ కిషన్ (20), తిలక్ వర్మ (25) మంచి ఆరంభాలనే అందుకున్నా, వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఒకే ఓవర్లో తిలక్ వర్మ, శివమ్ దూబే (0) వికెట్లను కోల్పోవడంతో భారత్ 46 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తనదైన శైలిలో ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో సూర్యకుమార్ ఒంటరి పోరాటం చేశాడు. కేవలం 49 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 84 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. రింకూ సింగ్ (6), హార్దిక్ పాండ్యా (5) విఫలమైనా, చివర్లో అక్షర్ పటేల్ (14)తో కలిసి జట్టు స్కోరును ముందుకు నడిపించాడు. సూర్య సూపర్ ఇన్నింగ్స్ కారణంగా టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 161 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. అమెరికా బౌలర్లలో వాన్ షాల్క్‌విక్ 4 వికెట్లతో సత్తా చాటాడు. ఇక, మెగా టోర్నీలో భారత్ తన తదుపరి మ్యాచ్ ను ఫిబ్రవరి 12న నమీబియాతో ఆడనుంది. గ్రూప్-ఏలో భాగంగా జరగనున్న ఈ మ్యాచ్ కు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా నిలవనుంది.

వాళ్లూ మనోళ్లే.. అమెరికా జట్టులో భారత సంతతి ఆటగాళ్లు

టీ20 ప్రపంచకప్‌లో అమెరికాతో మ్యాచ్ అంటే భారత్ తేలికగా గెలిచేస్తుందనుకున్నారంతా. కానీ తీవ్రంగా తడబడి.. తర్వాత పుంజుకుని గెలిచింది. భారత్‌కు ఇంత పోటీ ఇచ్చిన జట్టులో ఉన్న మెజారిటీ ఆటగాళ్లు భారతీయులు, భారత సంతతికి చెందినవారే కావడం విశేషం. అందులో ఒకరు తెలుగు కుర్రాడే కానీ.. ఇంకో ఆరుగురికి భారత్‌తో సంబంధం ఉంది. సాయితేజ ముక్కమల్ల.. ఈ పేరు చూస్తేనే అతను తెలుగువాడని అర్థమైపోతుంది. సాయితేజ తండ్రి నాగేశ్వర్‌రెడ్డిది ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం, కమలాపురి. తండ్రి ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడడంతో సాయితేజ అక్కడే పుట్టి పెరిగాడు. క్రికెట్ శిక్షణలో భాగంగా అతను భారత్‌తో పాటు ఇంగ్లాండ్‌కు కూడా వెళ్లాడు. ఏడాది పాటు హైదరాబాద్‌లోని వీవీఎస్ లక్ష్మణ్ అకాడమీలోనే ఉన్నాడు. టీ20 లీగ్స్‌లో సత్తా చాటడంతో అతడికి అమెరికా జట్టులో చోటు దక్కింది. రెండేళ్లుగా టాప్‌ఆర్డర్లో కీలక బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు.

సాయితేజ

దిల్లీకి చెందిన మిలింద్ కుమార్.. భారత్‌లో దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఈ ఆల్‌రౌండర్‌కు ఐపీఎల్ జట్టు దిల్లీ డేర్‌డెవిల్స్‌లో అవకాశం దక్కింది కూడా. కానీ మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. తర్వాత అతను అమెరికాకు వెళ్లిపోయి, జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. శుభమ్ రంజానేది మహారాష్ట్ర. అతను నాలుగేళ్ల కిందటి వరకు దేశవాళీల్లో ఆ జట్టుకు ఆడాడు. ఇక్కడ పోటీ ఎక్కువగా ఉండడంతో ఈ ఆల్‌రౌండర్ అమెరికాకు మళ్లాడు. ప్రస్తుత అమెరికా కెప్టెన్, టాప్‌ఆర్డర్ బ్యాటర్ మోనాంక్ పటేల్‌ది గుజరాత్. అండర్-19 స్థాయి వరకు అతను గుజరాత్‌కే ప్రాతినిధ్యం వహించాడు. ఇక అమెరికా జట్టులోని స్పిన్ ఆల్‌రౌండర్ హర్మీత్ సింగ్, ఫాస్ట్‌బౌలర్ సౌరభ్ నేత్రావల్కర్‌లిద్దరూ ముంబయి వాళ్లే. మిడిలార్డర్ బ్యాటర్, స్పిన్నర్ సంజయ్ కృష్ణమూర్తి పుట్టింది, పెరిగింది అమెరికాలోనే అయినా.. అతడి మూలాలు కర్ణాటకలో ఉన్నాయి. అతను అండర్-16 స్థాయిలో కర్ణాటకకు ఆడాడు కూడా. శనివారం మ్యాచ్ ఆడిన జట్టులో మిగతా నలుగురిలో కూడా ఒక్కరూ పక్కా అమెరికన్ కాదు. మోసిన్, అలీ ఖాన్ పాకిస్థాన్‌కు చెందిన వాళ్లు కాగా.. శాండ్లీ, ఆండ్రీస్ గాస్ దక్షిణాఫ్రికా నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడ్డారు.

యష్ టాక్సిక్..అదే నిజమైతే కష్టమే?

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ -టాక్సిక్:ది ఫైరీ టేల్ ఆఫ్ గ్రోన్ అప్స్- పేరుతో పీరియడ్ గ్యాంగ్ స్టర్ డ్రామాని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. యష్, గీతూ మోహన్ దాస్ స్క్రిప్ట్ అందించారు. కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ అధినేత వెంకట్ కె. నాయారణతో కలిసి ఈ మూవీని భారీ స్థాయిలో హీరో యష్ నిర్మిస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమ ఖురేషీ, రుక్మిణీ వాసంత్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. గోవా నేపథ్యంలో 1980లో సాగే డ్రగ్ మాఫియా కథగా దీన్ని గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తోంది. దీనికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. కన్నడతో పాటు ఇంగ్లీష్‌లోనూ రూపొందుతున్న ఈ మూవీని పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయబోతున్నారు. నదియాగా కియారా అద్వానీ, ఎలిజబెత్‌గా హ్యూమా ఖురేషీల ఫస్ట్ లుక్ పోస్టర్‌లని విడుదల చేసిన మేకర్స్ తాజాగా నయనతార లుక్‌ని విడుదల చేశారు. ఇందులో నయన్ గంగ అనే కీలక పాత్రలో కనిపించబోతోంది.

మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకుని పవర్‌ఫుల్ లుక్‌లో నయనతార కనిపించి సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఇందులో మొత్తం ఐదుగురు క్రేజీ హీరోయిన్‌లు నటిస్తున్నారు. ఇప్పటి వరకు నదియాగా కియారా అద్వానీ, ఎలిజబెత్‌గా హ్యూమా ఖురేషీ, గంగగా నయనతార ఫస్ట్ లుక్‌లని పరిచయం చేశారు. ఈ ఏడాది మార్చి 19న భారీ స్థాయిలో ఈ మూవీ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ మూవీకి సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారి చర్చనీయాంశం అవుతోంది.

ఇందులో నయనతార మోడ్రన్ డ్రెస్‌లో కనిపిస్తూ ఓ వ్యక్తికి షేక్ హ్యాండ్ ఇస్తుండగా.. తనని అనుసరిస్తూ బ్లాక్ హ్యాట్, వైట్ సూట్ ధరించి యష్ కనిపించాడు. ఆ పక్కనే హ్యూమఖురేషీ రెడ్ డ్రెస్‌లో కనిసిస్తోంది. ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్‌లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొంత మంది నయన, యష్ స్టైలిష్‌గా ఉన్నారని కామెంట్ చేయగా మరి కొంత మంది మాత్రం బాంబే వెల్వెట్‌ని గుర్తు చేస్తోందన్నారు. మరో నెటిజన్ -బాంబే వెల్వెట్ మళ్లీనా? అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. దీంతోద

టాక్సిక్‌పై అనుమానాలు

మొదలయ్యాయి. నయనతార స్టైలిష్ లుక్‌ని రిలీజ్ చేసినప్పుడు పెరిగిన అంచనాలు ఇది మరో బాంబే వెల్వెట్ అనే కామెంట్‌లు రావడంతో నీరుగారి పోతున్నాయి. ఇదే నిజమైతే టాక్సిక్ యష్‌కు భారీ పరాజయాన్ని అందించడం ఖాయం అని, తెలిసి తెలిసి ఇలాంటి పొరపాటుని యష్ చేయడని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. గ్యాన్ ప్రకాష్ రాసిన బుక్ ఆధారంగా అనురాగ్ కశ్యప్ రూపొందిచిన మూవీ బాంబే వెల్వెట్. రణ్‌బీర్ కపూర్, అనుష్క శర్మ, కరణ్ జోహార్, కెకె మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. భారీ అంచనాల మధ్య విడుదలై ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలిచి షాక్ ఇచ్చింది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com